# ఉత్తమాదర్శములు

గ్రంథకర్త:
వి. రామయ్య, బి. ఏ., ఎల్. టి.,
హెడ్‌మాష్టరు, హిందూ కాలేజి హైస్కూలు,
మచిలీపట్టణము

ది ఓరియంట్ పబ్లిషింగ్ కంపెనీ, (రిజిష్టర్డు)
మద్రాసు :: తెనాలి :: హైదరాబాదు

కాపీరైట్] 1955 [వెల రు. 0—10—0

Slo 163

# ఉత్తమాదర్శములు

PARA ASHOK KUMAR

ఉత్తమజీవితముల చిత్రించు కథల సంపుటి.

గ్రంథకర్త:
వి. రామయ్యా, బి. ఏ., ఏల్. టి.,
హెడ్‌మాష్టర్ హిందూకాలేజి హైస్కూలు
మచిలీపట్టణము

**ది ఓరియంట్ పబ్లిషింగ్ కంపెనీ** (రిజిష్టర్డు)
మద్రాసు :: తెనాలి :: హైద్రాబాదు

కాపీరైట్ ] 1955 [వెల రు. 0—10—0

రామా ప్రెస్, తెనాలి

# తొలిపలుకు

బాలకులే దేశమునకు భావిసౌభాగ్యలేఖాంకురములు, వారి నుత్తమమార్గమునఁ బెట్టుట కాదర్శపరంపర లుత్తేజ కారకములు. ఒకఁడు వీరుఁడగును. ఒకఁడు కవి యగును. ఒకఁడు భక్తుఁ డగును. ఏది యెవఁడగునో మున్నే యెఱుఁగ వలనుపడదు గద! కాన నన్ని యాదర్శములు గుదిగూర్చి వారి ముం దిడినచో నేది యెవని కనుగుణముగ నుండునో యది వాని కావేశమును గలిగించి ప్రబోధించును. ఈ యుద్దేశ్యమును మనమున నిడికొని వ్రాసిన యీ గ్రంథము విద్యార్థులకుఁ బఠనీయ పుస్తకమై, చిరంజీవియై వెలయునని మా ఆశయము.

# విషయ సూచిక


| | | | |
|---|---|---|---|
| 1. | ఛాత్రావతంసుఁడు | ... | 1 |
| 2. | మూఢభక్తుఁడు | ... | 7 |
| 3. | ప్రజాహితుఁడు | ... | 11 |
| 4. | మతాంతరభక్తుఁడు | ... | 16 |
| 5. | శౌర్యాగ్ని | ... | 31 |
| 6. | కవీశ్వరుఁడు | ... | 39 |
| 7. | అమాత్యశేఖరుఁడు | ... | 47 |
| 8. | సేవకాధికుఁడు | ... | 55 |
| 9. | దైవభక్తుఁడు | ... | 62 |
| 10. | ఋషితిలకుఁడు | ... | 70 |
| 11. | అవతారపురుషుఁడు | ... | 80 |

# ౧. ఛాత్త్రావతంసుఁడు

క॥ గురుకులమునందు గురులకుఁ
బరిచర్య లొనర్చి తా నపరిమితనిష్ఠా
పరుఁడై జ్ఞానము వడసెను
గురుదయ నణిమాదికాష్టగుణములతోడన్.

విద్యాగ్రహణ కుతూహలపరుఁడు ఛాత్త్రముఖ్యుఁడు. శిష్యున కుండఁదగు సుగుణపరంపరలో గురుభక్తి, విద్యాగ్రహణ దీక్ష, సదాచారము, వినయవిధేయత మున్నగునవి ముఖ్యములు. కించి ద్విద్యాప్రసక్తి కుదిరినతోడనే గర్వించి నాయంతవాఁ డుర్వి లేఁడని గురువునకుఁ బంగనామములు పెట్టు విద్యార్థి వ్యర్థుఁ డగును. చతుష్షష్టి కళలయం దేదియైనఁ గావలయు నని కోరి యుపాధ్యాయు నర్థించి శుశ్రూషాపరతంత్రుఁడై సాధించిన శిష్యున కిహపరలోకఫలములు కలుగు ననుటలో సందియము లేదు. ఇందుల కొక భారతకథ తార్కాణము నిచ్చుచున్నది.

పంచమామ్నాయమని నుతికెక్కిన భారతమునఁ గథానాయకులగు పాండుపుత్త్రవరులైన ధర్మజభీమార్జుననకులసహదేవులను నస్త్రశస్త్రవిద్యల నారితేరఁ జేసిన గురూత్తముఁడు విప్రసత్తముఁడగు ద్రోణాచార్యుఁడు. అథర్వవేదవిశారదుఁడగు నా కుంభసంభవుం డెనలేని లోకవినుతి గాంచి పాండవమధ్యముండగు విజయు నజయ్యుగాఁ జేయనెంచి ముఖ్యశిష్యునిగఁ

జేకొని యస్త్రశస్త్ర విద్యలఁ దీర్చెను. ఆమంత్రణ, సంధి, సంహారోపసంహారా ద్యస్త్రవిధానంబులను, విల్లునెక్కిడుట, తిరుగుట, లక్ష్యము జూచుట, విడుచుట మున్నగు శరప్రయోగ సంవిధానములను నాగురుసత్తముఁ డా యర్జునకు నేర్పి, 'నిన్ను మీఱిన ధనుర్విద్యావిశారదు లెందును నుండ నోప'రని వానికిం జెప్పి వానిచే ద్రుపదరాజునందుఁ దనకుఁగల పగను దీర్చికొని యానందించుచుండెను.

ఇంద్రప్రస్థపురసమీపమున నొక కాననము గలదు. అందొక కిరాతుఁడు నివసించుచుండెను. అతఁడు సుగుణవంతుఁడు; విద్యాసంగ్రహణ కుతూహలుఁడు; ఏకలవ్యుఁడను నభిధ గలవాఁడు. శిష్యోచితమైన సుగుణరాశి యతనియందుఁ గలదు. గుణములకుఁ గులము ప్రధానము గాదు గదా! బురదయందును బద్మములు పుట్టుచుండును.

ఆ కిరాతుఁ డొకనాఁడు విద్యార్థియై ద్రోణునిపాలికిం బోయి సవినయంబుగ నమస్కరించి 'గురూత్తమా! నేను మీ శిష్యుఁడను. నాకు ధనుర్విద్యాభ్యాసమునం దభిలాష గలదు. మీరు నాయం దనుగ్రహ ముంచి శరవిద్యను నాకు నేర్పుఁ'డని వేడుకొనెను. కుంభజుఁ డుత్తమసనాతనవర్తనుఁడు; వేదవిదుఁడు. ధనుర్విద్య యథర్వవేదాంతర్గత మగుటయు, వేదము ద్విజేతరాధ్యాపనయోగ్యము గాకుండుటయు, నాతఁడెంచి "కిరాతపుత్రా! నీవు ద్విజేతరుఁడ వగుటం జేసి విద్యాభ్యాసనార్హుఁడవు కావు. కావున నీవు నన్ను యాచింప నుపయోగముగలే"దని పలికెను. ఏకలవ్యుఁడు చిన్నవోయి, 'జనకా'!

నా యభిలాష నడుగంటఁ జేసితిరి. నేను కులహీనుఁడ నగుటచే విద్యాగ్రహణోచితుఁడను గాకున్నను మీరు నాకు గురువులరు. మీ ముఖసందర్శన మాత్రముననే నా కోరికలు సఫలముఁ కాగలవు. నాయందు వాత్సల్యముంచి భావంబుననైన నన్ను త్వదీయ శిష్యపరంపరలో నధమునిఁగనైన నెంచగోరెద' నని చెప్పి నమస్కరించి వెడలిపోయెను.

ఏకలవ్యునకు ధనుర్విద్యావాంఛ తఱుఁగలేదు. విద్యార్థి యగు గుణవంతున కెన్ని యభ్యంతరములు గలిగినను దన ప్రయత్నములను వీడఁడు. ద్రోణాచార్యునిపై గురుభావ ముంచి ఏకలవ్యుఁడు నిజోద్యోగమునకుఁ గడఁగఁ దలఁచెను. సగుణోపాసనముననేగాని భక్తిప్రపత్తులు కుదుర నేరవు. భక్తిలేనిపూజ పత్రిచేటు. ఏ కార్యమునైనను భక్తితోఁ జేసిన ఫలితార్థము నొందఁగలరు. ఏకలవ్యుఁడును గురుభక్తిలేనిచో విద్య లభింపఁ జాలదని నమ్మెను. అరణ్యమునం దొక పర్ణకుటీరమును నిర్మించి, యందు ద్రోణాకారమున నొక విగ్రహమును జేసి స్థిరతరభక్తి ప్రపూర్ణమానసుఁడై యా కిరాతుఁడు దినదినము శుశ్రూషలఁ జేయుచు ఛాత్రవిధుల నెరవేర్చుచు నిజాభీష్ట మోదకరమగు ధనుర్విద్యాభ్యాసమున కుపక్రమించెను. శ్రద్ధవంటి పదార్థము లేదు. ఏకలవ్యుఁ డెడతెగని శ్రద్ధాభక్తుల నా ద్రోణవిగ్రహము నిష్టదైవమట్ల నమందానందోత్సాహంబులఁ బూజించుచు శరసంధానాది విధానముల నభ్యసించుచుండెను. 'అభ్యాసము కూసువిద్య' యనునట్లు ప్రయత్నముచే నెట్టికార్యమయిన సులువుగాఁ జేకూఱఁగలదు. మనము ద్రోణాయత్తమగుటయు

నతనికి ధనుర్విద్య మఱింత సులువుగా నలవడెను. విల్లునుబట్టుట శరములం దొడఁగుట, తిగుచుట, విడుచుట మున్నగు శరకార్యములును, శబ్దభేది, దూరదర్శి, నారిలక్ష్యాది యుత్తమవిదలను నతఁడు సూక్ష్మబుద్ధితో గ్రహించెను.

ఒకానొకదినమునఁ బాండుపుత్రులను వెంటఁదీసికొని కుంభసంభవుఁ డరణ్యమునకు విహారార్థమేఁగెను. రాజపుత్త్రులు ధనుర్ధరులై విలాసార్థ మడవియందుఁగల క్రూరమృగముల బాధించుచు, వృక్షములపైనున్న పక్షుల శిక్షించుచు, నొకరికంటె నొకరు దాము పైచేయి యని పంతములాడుచు, గురువునకుఁ దమ హస్తలాఘవముఁ జూపి యుబ్బుచు వనసంచారము సల్పుచుండిరి.

నిర్జరారణ్య మగుటచే నది వాసయోగ్య ప్రదేశముకాదు. ఎక్కడనుండియో యొక కుక్కురము మొఱుఁగుచు వారిని నిలువఁ బెట్టెను. రాజపుత్రుల కది విస్మయము గలిగించెను. ఈ శునకము మనుష్యసంచారము సూచించుచుండె ననియు, నది యొకానొక వేఁటకాని కుక్కయై యుండుననియు వారెంచిరి. అర్జునుఁడు తన బాణపరంపరచే నాకుక్కురమును గదల లేనట్టుల బంధించెను. ఏకలవ్యుఁడు నిజనివాసమ్మునుండి తన కుక్క సేయు నార్తధ్వనిని వినెను. తోడనే ధనుస్సును గైకొని బాణపరంపరను దండవలె నిర్మించి శబ్దమూలంబునఁ గుక్క యుండునెడ కా శరంబుల సంధించి నరునిబాణంబుల ఖండించి కుక్కను విడిపించెను. కుక్క యేకలవ్యుని నివాసమునకుఁ బరుగెత్తెను. ద్రోణున కాశ్చర్యము కలిగెను. నరునకు విన్నదనము

చేకూఱెను. తనకన్న మిన్నయగు ధనుర్విద్యాపారంగతుం డొకఁడుండెనని ఫల్గుణుఁడు గురునకు నమస్కరించి, "ఆర్యా! నన్నజయ్యునిఁ జేయుదుమంటిరే? తాడిదన్నువానిఁ దలదన్ను వాఁడును నుండునన్నమాట!" యనెను. ద్రోణునకు రోసము కలిగెను. తోడనే శిష్యులంగూడి ద్రోణుఁడు కుక్కమార్గమును బట్టి కిరాతుని వాసస్థలంబున కేఁగెను. ఏకలవ్యుఁడు ద్రోణునిఁ జూచి యమందానందకందళిత హృదయారవిందుఁడై, యుచితాసనాసీనుఁ గావించి, గురున కర్ఘ్యపాద్యాదు లొసఁగి నమస్కరించెను. "గురువర్యా! నేఁటికి ధన్యుఁడనైతిని. ఇప్పటికి నా విద్య సఫలతనందినది." అని పలికెను. ద్రోణున కేదియుఁ దెలియలేదు. రాజపుత్త్రులు వెలవెలఁబోయి చూచుచుండిరి. "కిరాతుఁడా! నీ వెవడవు? మాయం దిట్టి భయభక్తులు గలుగుటకుం దగుకారణమేమి? నీ పేరేమి? మేముబంధించిన యీకుక్కను సాహసించి విడిపించిన ధనుర్విద్యాధికుఁడెవఁడు?" అని ద్రోణుఁడు ప్రశ్నించెను. "ఆర్యా! మీరు నాపై కృపావిహీనులై యున్నట్లు తోఁచెడిని. నేను మీ శిష్యుఁడను; ఏకలవ్య నామధేయుఁడను. మీ కటాక్షంబుననే ధనుర్విద్యాపారంగతుఁడ నైతిని. ఈ కుక్క నాది. దీనిని విడిపించినవాఁడను నేనే" యని బదులు చెప్పెను. ద్రోణున కాశ్చర్యము కలిగెను. ఏకలవ్యుని వాక్యములను వ్యాఖ్యానము కావలసియుండెను. 'నే నెట్లు నీకు గురుఁడనైతి?' నని యడిగెను. ఏకలవ్యుఁడు వారినిఁ దన లక్ష్యవిగ్రహాలయమునకుఁ గొనిపోయి 'ఆచార్యవర్యా! మీయొద్ద ధనుర్విద్య నభ్యసింపవచ్చి యర్థించి మీచే నిరాకృతుఁడనై మీ యాకృతి నిట్లు నిలుపుకొని విద్య నభ్యసించి

తిని. మీ యనుగ్రహమే నన్నిట్టివీరునిఁగా జేయఁజాలిన'దని వచించెను. ద్రోణుఁ డాశ్చర్యపడి, తా నర్జునున కిచ్చిన వాగ్దానము పొల్లుపోవుచున్నదిగదా యని యెంచి 'శిష్యా ! నీభక్తికిఁ గడుంగడు సంతసించితిని. కాని గురుదక్షిణ పెట్టనిదే విద్య రాణింపదు. ఏమి యిచ్చెద' వని యడిగెను. గురుభక్తి పరవశుఁడగు నేకలవ్యుఁడు 'ఏది కోరినను దాని నొసంగ సంసిద్ధుఁడ' నని ప్రత్యుత్తర మిచ్చెను. ద్రోణాచార్యుఁడు 'నీ దక్షిణహస్త ప్రథమాంగుళిని దక్షిణగాఁ బెట్టు' మని కోరెను. భక్తులకు సాధ్యముగాని పని యేమి కలదు? ఏకలవ్యుఁడు తోడనే తన బొటనవ్రేలిని ఖండించి యిచ్చివేసెను. అర్జునునకు సంతసము చేకూరెను. ద్రోణుఁ డందులకు మెచ్చుకొని 'శిష్యునకుండవలసిన గుణము నీయందున్నది. నీవు నాకు ఛాత్రావతంసుఁడవు. నీ వంశమువారందఱును ధనుర్విద్యావిశారదులు కాఁగల'రని దీవించి రాజపుత్త్రులతో నిజపట్టణమున కేఁగెను.

విద్యార్థులకు భక్తిశ్రద్ధలే ప్రధానగుణములు.

# ౨. మూఢభక్తుఁడు

సీ॥ చేతులారంగ శివునిఁ బూజింపఁడేని
నోరు నొవ్వంగ హరికీర్తి నుడువఁడేని
దయయు, సత్యంబు లోనుగాఁ దలఁపఁడేని
కలుగ నేటికి తల్లుల కడుపుచేటు.

చిత్తశుద్ధిగల ప్రేమాతిశయమే భక్తి నాఁబరఁగు. భక్తికి స్థలనిర్ణయము లేదు. సత్కులీనులై గుణసంపదలతోఁ బ్రాలు నుత్తములందు మాత్రమే భక్తి ప్రవేశింపదు. మేధావిహీనులైన కిరాతాది మూఢజనులందును భక్తి ప్రవేశింపఁగలదు. మూఢుల భక్తి కొలఁదిగ మించియుండును. భగవద్భక్తులెల్లఱు నిహలోక వ్యవహారములందు మూఢుల ట్లగపడుచుండుట సత్యమే. జడభరతుఁ డాముష్మికవిషయజ్ఞానుఁడయ్యు జడునిభాతి సంచరించుచుండువాఁడు. శ్రీమద్రామాయణకర్త యగు వాల్మీకి వృత్తాంతము నెఱుంగనివారు లేరుకదా! ఈశ్వరధ్యానము ధనవంతులకును, నాగరికులకును లభింపదు. మూఢభక్తియే శీఘ్రమోక్షహేతువు. ముక్తిని గాంచవలెనని యత్నించువారలు ఫలమును బొందఁజాలరు. నిష్కామకర్మలు ఫలప్రదములు. కామికి క్షేమములేదు. ఇందుల కొక తార్కాణము గలదు.

హిందూదేశమున వింధ్యాద్రికి దక్షిణమున మునిజన నివాసయోగ్యమై, పుళిందజనాలవాలమై, నానావిధక్రూర మృగపక్షివితానసంచారభూమియైన దండకావనము గలదు. అందుఁ బొత్తపివాఁడ యను నొక నివాసయోగ్యప్రదేశమున

నుండు మూరయను నొకపల్లె గలదు. అయ్యది కిరాతుల కావాసమై విరాజిల్లుచుండెను. నాథనాథుండను కిరాతభూనాయకుం డా యరణ్యప్రదేశముల నేలుచుండెను. ఆ రాజునకుఁ దందె యను సుందరాంగి యిల్లాలై చెలువొందుచుండెను. వార లాయరణ్యమున సుఖవిలాసములతోఁ గాలముఁబుచ్చుచు మృగయావినోదలోలురై, శుద్ధమనస్కులై, సత్యప్రవర్తనాసక్తులై, కులాచార సంచారులై వెలయుచుండిరి. వారు పరోకారతత్పరతతో భగవద్విలాసమును దలపోయుచు నానందించుచుండెడివారు.

ఆభూనాయకునకు లేకలేక యొక కుమారుఁడు కలిగెను. నాథనాథుఁడు కులాచారపద్ధతి ననుసరించి పురిటియుత్సవమును నెఱపి పసిబాలునకు దిన్నఁడను నామకరణము నిడి, కులపువారలఁగూడి కుడిచి యానందించెను.

బాలుఁడు దినదినాభివృద్ధిగాంచి తిన్నని ప్రవర్తన గలవాఁడై నిజాభిధానము నన్వర్థము గావించుకొనియెను. తండ్రి పనుపునఁ దిన్నఁడు కులోచితవిద్యయగు విలువిద్యనభ్యసించుచు మన మీశ్వరాయత్తముఁజేసి, ప్రకృతిసౌందర్యములో భగవంతుని దర్శించుచుండెను. అతఁడు కాలక్రమమున యౌవన సంపన్నుఁ డయ్యెను.

ఒకానొకనాఁ డతఁడు వేఁటకై సకలోపకరణములఁ గైకొని దీమముల వేఁటకుక్కల వెంటఁదీసికొని, మృగముల హింసించుచుఁ బక్షులం బట్టుచుఁ, గ్రూరసత్వంబుల ఖండించుచు, అరణ్యమునఁ జాలదూర మేగెను. మృగయా

పరిశ్రాంతిచే డస్సి యొకానొక తరుచ్ఛాయను బరుండి తిన్నఁడు నిద్రించెను. అనుచరు లందందు సంపాదించిన యామిషంబుల జాగ్రత్తపఱచి, యందం దుపవిష్టులై యుండిరి. తిన్నని కొక స్వప్నము వచ్చినది. ఒకానొక జ్యోతిర్లింగము నభిషేకము సేయుచు, ఫలముఁదెచ్చి నైవేద్యమిడి చూచుచుండఁ దన నేత్రములు రెండును బోయినట్లు తోఁచెను. నిద్రమేల్కాంచి యటునిటుఁ జూచెను. ఏమియుఁ గనఁబడలేదు. నిజభృత్యు లామిషమును గాఁచుకొని కూర్చుండిరి. ఒక వరాహ మాతని కంటబడెను. తిన్నఁడు వెంటనే బయదేఱి దానిని వెన్నంటి ముందునకు సాగిచనియెను. కాని యా వరాహ మాయరణ్య మధ్యమున నంతర్హితమాయెను. పొదరిండ్లచే సాంద్రమై యా యరణ్యమధ్యమున నొక వృక్షమూలమున నొక శివలింగ మాతనికంటఁబడెను. ఆ లింగమును జూచినతోడనే తిన్నని శరీరము గగుర్పొడిచెను. ఆ లింగముదగ్గఱ కరిగి, దానిని గౌగలించు కొనియెను. స్వప్నమందు దర్శించిన జ్యోతిర్లింగకాంతి యీ లింగమం దంతర్హితమై యుండుట వానికిఁ దోచెను. వాని భక్తి మెక్కువయ్యె. తోడనే స్తోత్రరూపమున నా లింగమును బలుకరించి మాటలాడ సాగెను. భక్తులెల్లఱు జడులేకద! 'అయ్యా! ఒంటరిగా నీ వీ యరణ్యమున నుండుటకుఁ గారణ మేమి? భార్యతో బోరాడి విడియాకు గొనివచ్చి యిట దాఁగితివో? శ్మశానముల భైక్షము దొరకక యీ యడవిలోఁ దపంబునకై వచ్చితివో? ఈ జడత్వమేల? ఈ కఠినతయేల? నా పలుకులకు బదులీయక నీ వూరకుండుటకు నేనేమి తప్పుసేసి

తిని? కదలవేమి ? నీవు బయలుదేఱి నా యింటికి రారాదా ! ఈ నిర్జనారణ్యమున నెండవానలకుఁ గాసిలనేల ? నీ కిచ్చట నాహారమిచ్చువా రెవరు ? తండ్రీ ! నా మాట విని నా వెంట వచ్చినచో నీ యిచ్చవచ్చిన పదార్థము లిచ్చెదను. నిన్ను నా శిరంబునఁ గొనిపోయెదను. దైవమా ! నీ కిట్టి యరణ్యవాస మేల కలిగినది ?' అని పరిపరివిధంబులఁ జింతించుచు బిగ్గఱగా నఱచుచుఁ, దాఁ గొనివచ్చిన పలలంబులలో నుచితంబులగు వానిం గొనిపోయి వానిముందు నిలిచి, 'తినినఁగాని నేను విడువ'నని పట్టు పట్టెను. అప్పు డా శిలావిగ్రహ మేమియుఁ గదలకుండుట గని, 'ఈశ్వరా ! నే నెంతపాపిని ! నే నాహార మిచ్చినను దినకుంటివే ! తినకున్న నిదే చచ్చెద'నని శిరంబు నా లింగమున మోదికొన, నా పరమశివునకు నొప్పికలిగి నదియో యన నొక కంటివెంట నీరు కాఱఁజొచ్చెను. తిన్నఁ డదిగని నొచ్చిన చిత్తముతో నా కంటికిం దగు నుపచారంబులఁ జేయుచు, నరణ్యమునఁ గల నానావిధౌషధంబులఁ ప్రయో గింప, నా కన్ని రంతకంత కెక్కుడై, రక్తము స్రవింప నారం భించెను. తిన్నఁడదిగని చింతాక్రాంతమానసుండై యేమియుం దోపక నారసంబుతోఁ దన నయనమును బెఱికి యా శివుని భగ్న నేత్రమున సరిపెట్టెను. వెంటనే యాశ్చర్యకరముగా రెండవకంట నీరు కాఱఁజొచ్చెను. తిన్నఁడు దానికి నుపచార ములు సేసెను. చూచుచుండగనే యాకన్ను లొట్టపడినది. తోడనే తిన్నఁడు నారసంబునఁ దన రెండవకన్ను నూడఁబెఱికి యీశ్వరుని నేత్రరంధ్రమున నిలిపెను. శంకరుని మనస్సు కరఁగి ప్రేమతరంగితమై పోయెను. తిన్నఁడు నిజమైనభక్తుఁడని

యీశ్వరునకు నమ్మకము గలిగెను. వెంటనే తిన్ననికి హరస్వరూపము మానసగోచరమయ్యెను, తిన్ననికిఁ గన్నులు వచ్చెను, పరమేశ్వరుఁడు పార్వతీసమేతుఁడై తిన్ననికి బ్రత్యక్షమై వరములు కోరుకొమ్మనియెను. పుళిందున కాందసతరంగ మధ్యమున నేమియుఁ దోచలేదు. కరములు ముకుళించి, 'ఇందుధరా! నిత్యానందదాయకమైన నీ సాన్నిధ్యనివాస మొసఁగు' మని తిన్నఁడు ప్రార్థించెను. మహేశ్వరుఁ 'డట్లయగుఁగాక' యని యంతర్హితుఁడయ్యెను. తిన్నఁడు దినదినము నానందమయమైన పరమేశ్వరసాన్నిధ్యమున భక్తిపరవశుఁడై జీవితమును బుచ్చెను. తుదకుఁ గైలాసనివాసుఁడై గణుతికెక్కెను.

"మూఢభక్తివలనఁగూడ ముక్తి గలదు."

---

## 3. ప్రజాహితుఁడు

గీ॥ ఆజ్ఞయును, గీర్తియును, భూసురావనంబు,
దానమును, భోగ మిత్రసంత్రాణములును
షడ్గుణంబులు గలుగవే జనులయందు
వారి గొల్చిన ఫలమేమి వసుమతీశ !

భూతకోటిలో జ్ఞానవంతుఁడు మనుష్యుఁడు. అట్టి మానవుఁడు తన పుట్టువును లోకహితకార్యములందు ధన్య మొనరించుకొనవలెను. మానవులం దతీతుఁడు లోకబాంధఁడగు రాజు. రాజులు ప్రజలను గన్నబిడ్డలరీతిని ప్రేమపురస్సరంబుగఁ గాపాడుట విధి. లోకబాంధవుఁడు నిజకరంబుల లోకులను బాధింపక

విశ్వాసవంతుఁడై చిరకీర్తి నార్జింపఁ గలఁడు. కీర్తిప్రతాపసుభగుఁడగు మానవనాథుఁడు మృగజీవి. ఇందులకుఁ దార్కాణము హైందవరాజుల జీవితచరిత్రములలో నశోకవర్ధనునిచరిత్ర మొండు గలదు.

క్రీ. శ.నకు పూర్వము 3వ శతాబ్దమున మౌర్యవంశజుఁడగు నశోకవర్ధనుఁ డార్యావర్తము నేకచ్ఛత్రాధిపత్యము వహించి పాలించుచుండెను. సకలజనశోకనివారకుం డగుట చేతను, అఖిలభూతదయాపరుఁ డగుటచేతను అశోకుఁ డన్వర్థనాముఁ డనిపించుకొనుచుండెను.

మౌర్యవంశాలంకారుఁడగు బిందుసారుని కుమారుఁడు సుసీమనామకుఁడు. పాటలీపుత్రమును రాజధానిగాఁ జేసికొని యాతఁ డార్యావర్తనమును బాలించెను. ముఖ్యపట్టణమున కనతిదూరమునఁ జంపానగర మను నొక గ్రామము కలదు. ఆ జనపదమున నొక విప్రుఁడు గాపురము చేయుచుండెను. ఆ బ్రాహ్మణునకుఁ బూర్ణచంద్రవదనయుఁ గోమలగాత్రియు నగు నొక కొమరిత గలదు. ఆమె రూపమునందువలె గుణములందును లోకమున వినుతిఁ గాంచెను. సుసీముఁ డామెను జూచి కందర్పశరావిద్ధుఁడై యామెను నిజమందిరమునకు రావించి నిజాభీష్టము నెఱింగించెను. ఆ గుణవతి మతాంతరవివాహమున కులికిపడి, తన జనకుని యనుజ్ఞను వేఁడఁగోరెను. 'రాజు తలఁచిన దెబ్బలకుఁ గొదువయా!' బిందుసారనందనుఁ డా బ్రాహ్మణుని రావించి యడిగెను. యయాతికి దేవయానింబోలె, సుసీమునకుఁ దనకూతు నిచ్చుట కంగీకరించి, - జనకుఁడు తన కొమరితను

మహారాజ్ఞినిఁ గావించెను. ఆమెవలన సుసీమునకు అశోకవర్ధనుఁడు, వీతశోకుఁడు నను నిద్దఱు కుమారులు గలిగిరి. ద్వితీయుఁడు గొప్ప సిద్ధుఁడై, వేదాంతవిద్యారహస్యవిదుఁడై వినుతికెక్కెను. అశోకుఁడు చక్రవర్తియై రాజధర్మములు విధివిధానముగ నాచరించి ప్రజాహితుఁ డాయెను. సుసీముండు కుమారులకు విద్యాబుద్ధులుఁ గఱపించెను. అం దశోకుఁడు రాజనీతినిపుణుఁడై బాల్యమునందే లౌకికవిద్యావిషయముల నేర్చి ధనుర్విద్యాభ్యాసముచేసి గుఱ్ఱపుస్వారియు, వేఁటయు మున్నగు కళల నలవఱచుకొనియెను. బాల్యమునుండియు మల్లయుద్ధములందును, గరిడీ సాములందును, నాఱితేరినవాఁడయ్యెను. తండ్రి పనుపున నశోకుఁడు యుక్తవయస్సునం దుజ్జయినీ పట్టణమునకుఁ బ్రతినిధిగా వరిగియుండెను.

అచ్చట చాలకాలముండి రాజ్యపరిపాలనము నలవఱచుకొనియెను. అందొక వైశ్యసుందరిని వరించి యతఁడు వివాహమాడెను. ఆమెయం దాతని కిరువురు కుమారులు గలిగిరి. తండ్రి యనుమతిఁగొని యశోకుఁడు తిరుగుబాటు సేసిన తక్షశిలపై దాడివెడలియుండెను. అతఁ డుత్సాహమున ససైన్యముగ నేగి, తక్షశిలను వశముఁ గావించికొనియెను. తిరిగి పాటలీపుత్రమున కతఁడు జేరినవెంటనే మంత్రులును, సర్దారులును, సుసీముని వంచించి, మాయోపాయమున రాజ్యభ్రష్టునిఁ గావించి, యశోకునకుఁ బట్టాభిషేకముఁ జేసిరి. సుసీముఁడు తక్షశిల కరిగి యచ్చట మరణించెను.

అశోకుఁడు రాజ్యాంగవిధులను శ్రద్ధతో మంత్రిసామంత హితవచనానుసారముగ, సధర్మముగ నెరవేర్చుచుండెను. ఆ కాలమున మహానదీకృష్ణాతరంగిణుల నడుమ విశాలమై చిర సంపాదితకీర్తివిస్తరమై కళింగరాజ్యము వెలుగొందుచుండెను. ఆ రాజ్యాధినేత లనన్యభేద్యములగు కోటల నిర్మించి, యరిభీకరులై రాజ్యపాలనము గావించుచుండిరి. అశోకుఁ డాత్మరాజ్యవ్యాపకమునకై కళింగరాజ్యముపై దండెత్తెను. ఉభయసేనలకును ఘోరమగుపోరు సంఘటిల్లెను. శత్రుసేనలరక్తస్రవంతులు పొరలిపారుచుండెను. ఇరుపార్శ్వములనమితప్రాణనష్టము గలిగెను. కాని యశోకుఁ డఖండవిజయమునుగాంచెను. అంత శత్రురాజులు వనములపాలైరి. కాని యశోకున కానందము కలుగలేదు. ఆధ్యాత్మికచింతనుం డగుటచే, నైహికవాంఛాపూరణార్థము తానుగావించిన జీవహింసాకృత్యమును నెంచికొని, యాతఁడు వ్యాకులము నొందసాగెను. అతని కది యొక యుద్బోధము. తోడనే తనరాజ్యమున యుద్ధమనునది జరుగనే రాదని చాటించెను. ప్రజాభీష్టములఁ బాలించు రాజుల హృదయములు నవనీతసదృశములు గదా !

ఆ కాలమున నార్యావర్తమున బౌద్ధమతము వ్యాప్తమై యుండెను. పరమేశ్వరుఁడు బుద్ధావతారమెత్తి లోకమునం దంతట పాషండమతస్థులఁ బాఱఁద్రోలి జీవహింస ముక్తిమార్గమున కనిరోధకారి యని సాటిచెప్పెను.

అప్పు డశోకుఁడు బౌద్ధసన్న్యాసుల రావించి, గౌరవించి వారివలన బౌద్ధమతమును స్వీకరించెను. ఆ మతతత్త్వ

మును రాజ్యమం దంతటను వ్యాపింపజేయుటకై యశోకుఁడు నానావిధముల బ్రయత్నించెను. కర్మయోగమును మరపించెను. దేశాంతరములకు బౌద్ధమతగురువుల నంపి, యా మతమును బోధింపించెను. తన రాజ్యాంతరభాగముల శిలాస్థూపంబులపై నిజమతసిద్ధాంతములఁ జెక్కించి పాదుకొలిపెను. 'యథారాజా తథాప్రజాః' అన్నట్లు పాలితజనులందఱు బౌద్ధులైరి. రాజ్యమున జీవహింస నశించెను.

రాజకీయవ్యవహారములలోఁ బ్రజలకు మిక్కిలి పన్నులు వేసి బాధింపక కొలఁదిగనే కప్పముల విధించి వారి సౌకర్యములకై బాటలు, సత్రములు, నీటివసతులు మొన్నగు సదుపాయములు చేయించి సప్తసంతానములచే దాను నుతికెక్కెను. రాజ్యమున నపరాధుల శిక్షించుటకు మఱి ప్రజలరాజశాసనాతిక్రమణము గావింపకుండఁ జూచుచుండుటకై యుద్యోగులు నియమింపబడిరి.

అశోకుఁడు విద్యాభిమాని. అతఁడు పండితలోకము నాదరించెను. ఉజ్జయిని, తక్షశిలలయందు విశ్వవిద్యాలయముల స్థాపించి యున్నతవిద్యావకాశములను బ్రజలకుఁ గలిగించెను.

ఈ రాజోత్తముని పరిపాలనము ధర్మరాజుపరిపాలనము వోలె సర్వజనామోదకరమై చిరయశస్స్ఫూర్తినిఁ గలుగజేసెను.

అశోకవర్ధనుఁడు చరమకాలమున మంత్రులరావించి తన నిర్యాణకాలము నెఱింగించి, గురువును ధ్యానించి, బౌద్ధాలయంబుల కమితద్రవ్యమొసంగి, కుమారుఁడగు కునీలునకు

రాజ్యము నొప్పగించెను. బుద్ధధ్యానముసేసి యశోకుఁడు కైలాసమున కరిగెను.

"ప్రజాహితులు చిరస్థాయులు."

---

## ౪. మతాంతరభక్తుఁడు

మ॥ అమలజ్ఞానత, దానధర్మరతి, సత్యక్షాంతి నిర్మత్సర
త్వములన్, యజ్ఞతపోనసూయలఁ గడుం దర్పించు ధాత్రీసురో
త్తముకంటెన్ శ్వపచుండు ముఖ్యుఁడు; మనోర్థప్రాణవాక్కర్మముల్
సమతన్ విష్ణునయించెనేని నిజవంశశ్రీకమండౌఁ దుదిన్.

పరమేశ్వరుఁడు నామరూపరహితుఁడు. సగుణోపాసనకై భగవంతున కెన్నిసంకేతనామములైనఁ బెట్టవచ్చును. పిపీలికాదిబ్రహ్మపర్యంతము జడాజడవర్తియగు నీశ్వరుఁడు సహస్రనాముఁడు. జీవకోటినిఁ బెంచి, నశింపుసేయువాఁడొక్కఁడే పరమేశ్వరుఁడు. మతవైషమ్యములఁ బట్టియు, భిన్నాభిప్రాయములఁ బట్టియు మన దేశంబున భిన్నభిన్నమతస్థులు భిన్నభిన్ననామముల దేవతల నారాధించుచుందురు. ఏతోవ నేగినను గమ్యస్థాన మొక్కటియే యైయుండుటచే వైషమ్యశూన్యుఁడగు మానవుఁ డేనామముతోఁడనైనను శుద్ధసత్త్వధాముఁడగు నామరూపరహితాత్ముని ధ్యానించి ముక్తి నందగలఁడు. మతవైషమ్యములు లౌకికవిషయములు. ఇహలోక వాంఛల నాసించువానికి మతద్వేష మంకురించును. అది వాని యాధ్యాత్మికమార్గమునకువిరోధము నొనగూర్చును.

సుగుణవంతుఁడై నిష్కల్మషమానసుఁడగు శుద్ధాత్ముఁడు కుల తత్త్వవిచారములులేక సేవించి ముక్తినందఁగలఁడు. ఇందుల కొక కథ దృష్టాంతము నిచ్చును.

ప్రథమభాగము :

పుణ్యవారాసి యగు వారణాసి కనతిదూరములో 'మహస్' అనుగ్రామము గలదు. అచ్చట మహమ్మదీయు లెక్కుడుగా నివసించుచుందురు. వారందఱుఁ జేతిపనులచేఁ జీవించెడివారు. అందును బట్టలనేత ముఖ్యము. కష్టజీవికి సుఖము మెండు. అట్టివానికే పరలోకచింత కుదురును. ఆ మహమ్మదీయులయందు గుణవంతుఁడును, భక్తిపరాయణుఁడును నగు తమాల్ మొఖీమ్ అను నొక గృహస్థుఁడు గలఁడు. భార్య జిజీబీబీ. దంపతులిరువురును గాయకష్టమునఁ బట్టువస్త్రముల నేసి విక్రయించి వచ్చిన లాభముతోఁ గొంత దానధర్మములకు వినియోగించి, మిగిలిన భాగమును మితముగా నుదర పోషణమునకుపయోగించుచు నీశ్వరారాధనము సేయుచుండిరి. ఈశ్వరుఁ డల్లా యనియు, నిర్గుణోపాసనంబున నాతని సేవింపవలయుననియు, మతగ్రంథమగు ఖురాన్ బోధించుచుండుటం జేసి యాదంపతులు కులాచారముగా 'నల్లాను' మానసపూజ సేయుచుండెడివారు. దంపతులు వయసుమీఱినవారు. వారికి వార్ధక్యదశారంభ మగుచుండెను. జిజీబీబీకి సంతానాపేక్ష వదలలేదు. వయ్యఃకాలమునఁ ఫకీరుల భక్తిం బూజించియు, నల్లాకునమాజులొనర్చియు, మహమ్మదీయ విధ్యుక్తవిధానముల సంతానాభివృద్ధికిం జేయఁదగిన క్రియాకలాపములం జరిపియు నామె నిష్ఫలము నొందెను. 'తమాల్' నిరాశుఁడై లోకుల

బిడ్డలే తనబిడ్డలనినమ్మి యందఱను ప్రేమతోఁ జూచుచుండెను.

ఒకానొకదినమున నొకఫకీరు తమాల్ మొఖీమ్ గృహమున కరుదెంచెను. ఆతఁ డింటలేడు. భార్య యా ఫకీరున కర్ఘ్యపాద్యాదులనిచ్చి, పూజించి, యుచితాసనాసీను గావించి, రొట్టెను, ఫలంబులను నివేదించెను. ఫకీ రామె భక్తికిఁ గడుంగడు మెచ్చి రొట్టె నారగించి, 'అమ్మా! చిరకాలమునుండియు నీ మనసునంగలకోరిక నీకు ఫలింపఁగలఁదు. కొలఁది కాలములో నీవు వంశవర్ధనుఁడగు కొమరునిఁ బడయఁగలవు' అని చెప్పి తనచేతిఫలంబు నొకదానిని నామెహస్తమునఁ బెట్టి 'దీనిని నీవే భక్షింపు'మని చెప్పి యదృశ్యుఁడాయెను. ఆమెయు నా ఫలంబును ఫకీరు చెప్పిన చొప్పున భుజించి యానందమానసయై యుండెను. భర్త గృహముఁ జేరుసరికి బీబీ యాయనకెదురేఁగి జరిగిన వృత్తాంతమును దెలిపెను. తమాలున కదియంతయు నమ్మకముగా దోఁచలేదు. కాల ముడిగినపిదప కానుపు లెట్లు వచ్చుననియు, నందనిపండ్ల కాసపడి యఱ్ఱులు చాచుట హాస్యాస్పదమనియు భార్యకుఁ జెప్పి నిరాశుఁడై నిజకార్యనిమగ్నుఁడై కాలము బుచ్చుచుండెను. జిజీబీబీకి నెల మసలెను. శరీరమున నూతనభావ మంకురించెను. ముఖమున పాండిమ గనఁబడెను. తమాలున కేదియో భావము గలిగెను. భార్యశరీరమున రుగ్మత ప్రవేశించినదని యతఁ డనుకొనియెను. వైద్యులను రావించి చూపెను. వా రవి గర్భచిహ్నములని తెలిపిరి. తమాలున కాశ్చర్యము కలిగెను. భార్యచెప్పినది నిజమగునేమో యని తలఁప నారంభించెను. ఆఫకీ రెచ్చటైనఁ గనఁబడునేమోయని వెదకసాగెను. కాని యాతడు కనబడలేదు. జిజీకి నెలలు నిండి

నవి. ఒకానొక సుముహూర్తమున తేజోవంతుఁడైన మగ శిశు వుద్భవించెను. కులాచారమున నాఱవనాఁడు పురిటియుత్స వముజరిపి ఫకీరులకు భోజనములుపెట్టి కుమారునకు కబీరను నామకరణము జేసెను.

కబీరు దినదినప్రవర్ధమానుఁడుకాగా శుక్లపక్షచంద్రుని భాతి రూపరేఖావిలాసముల వన్నెకెక్కెను. అతని కైదు వత్స రముల ప్రాయము వచ్చుసరికి, తమాలు మతాచారకర్మకలాప ములు నెఱపి, యొకానొక యొజ్జయొద్ద నక్షరాభ్యాసము గావించెను. బాలకుఁ డనుదినమును నా యుపాధ్యాయునియొద్ద విద్యాభ్యాసమును బొంది కొలఁదికాలముననే హిందీభాషయం దఖండపండితుఁ డాయెను. మహమ్మదీయులయం దెవరైన మరణించినచోఁ గృహస్థులెల్ల రా మృతకళేబరముతో శ్మశాన భూమికి వెళ్ళి యచ్చట శవసమాధిపర్యంతముండి యల్లాను స్మరించివచ్చుటనేఁటివఱకును నాచారము. తమాలటులనే యే సమాధి స్థలమునకైన వెళ్ళునపుడు కబీరును వెంటఁదీసికొని వెళ్ళుచుండువాఁడు. కబీ రా శవము నచ్చటఁ జూచినతోడనే యాధ్యాత్మికచింత మనస్సున నంకురించి, యీ లోకమున నన్నియు నశ్వరము లనియు, క్షణభంగురము లనియు, జీవ ముండఁగనే ముక్తికాంతను బడయు మార్గమును నెమకికొన వలయు ననియు నాలోచించెడివాఁడు. పాఠశాలయందు హిందీ భాషయందుఁ బారంగతుఁడయ్యును నిజశాస్త్రగ్రంథరహస్యము లెఱుంగ వీలులేకుండుటంజేసి, యత డరబ్బీ పారశీకభాషలం జదివి ఖురానునందుఁగల విషయముల విమర్శించి తెలిసి కొనెను. అతనికిఁగలిగిన వేదాంతసందేహముల కాగ్రంథముల

నెట్టిసమాధానమును దొరకనందునఁ గులవృద్ధులఁజేరి జీవ హింసావిషయమునను, సత్యపాలనవిషయమునను, బునర్జన్మవిష యమునను నెన్నియో ప్రశ్నల నడిగియు, లాభములేక విచా రించుచుండెను. హిందూమత రహస్యముల నెఱుఁగఁ గోరి హిందూశాస్త్రముల నభ్యసించి వేదాంతసిద్ధాంతములఁ గూర్చి తగుపండితుల నడిగి తెలిసికొననారంభించెను. వయసునఁ గడుఁ జిన్నవాఁడయ్యు విద్యాబుద్ధులం దగ్రగణ్యుఁడు కాఁదొడంగెను.

ఒకానొకదినంబున మహమ్మదీయులకు మోదకరమగు మొహరము పండుగ వచ్చెను. మహమ్మదీయులు దుస్తుల యందును, నాభరణములందును నెక్కుడు మక్కువగలవా రగుటచే గారాబుకొమరుఁ డగు కబీరునకుఁ దలితండ్రులు నాఁడు వివిధాభరణముల నలంకరించి విలువగల వస్త్రములఁ దొడిగి పంపిరి. కబీరు వీథిలోనికిఁ బోవుసరికి గొందఱు బిచ్చగాం డ్రన్నమునకులేక 'అల్లో లక్ష్మణా' యని యేడ్చుచు భిక్షాట నముఁ జేయుచుండిరి. కబీరు వారినిజూఁచి మనసు కరఁగిన వాఁడై తత్త్వము నెఱిఁగినవాఁ డగుటం జేసి, 'ఈ యస్థిరకాయ మునకు భూషలేల? మన కీసౌఖ్య మెందులకు?' అని తలంచి తన యాభరణాదులఁ దీసి భిక్షుకులకుఁ బంచియిచ్చి ఇంటికిఁ బోయెను. తలిదండ్రు లీ వార్త విని చిత్తంబులునొచ్చియు బాలుని మన్నించి యూరకుండిరి.

తమాలు కుమారునిఁ జేతిపనియందుఁ బ్రవేశపెట్టు టుచితమని తలంచెను. వస్త్రముల నేయు పనియం దాతని నియ మించెను. ఒకానొక దినమున నొక పట్టువస్త్రమును నేసి బజా రున విక్రయించుకొని రమ్మని తండ్రి కబీరు నంపెను. త్రోవ

యందొక బీదబ్రాహ్మణుఁడు వస్త్రహీనుఁడై కబీరుని యాచించెను. కబీరు తనచేతిలోని పట్టువస్త్రము నాతనికిచ్చి నమస్కరించి యింటి కరిగెను. తండ్రి కిసుమంత కోపము వచ్చెను. కాని కుమారుని నొకవొల్లుమాటయైన ననలేదు. ప్రతిదినమును గబీరిట్లు గృహస్థవస్తుసామగ్రులఁ దనవిటీలు దానము చేయుచుండుటచేత సంసార పరిస్థితులు బీదపడుచుండెను. తమాలు వృద్ధుఁడౌటచే, భార్యతో నాలోచించి కబీరునకు వివాహము చేసినచోఁ గుటుంబభారము పైఁబడి వానికి బుద్ధికునురునేమో యని తలంచెను.

ద్వితీయ భాగము :

కబీరునకు హైందవమత తత్త్వమున నంతు తెలియలేదు. దాని నెఱుంగుట కొక గురూపదేశ మావశ్యకమని యతఁడెంచెను. సద్గురూత్తమునకై యాతఁ డన్వేషించుచుండెను. కాశీ క్షేత్రమున లోకవినుతి గాంచినట్టి రామానందమఠ మొకటి కలదు. అందు రామానందస్వామి వేయిమంది శిష్యులతో వేదాంతతత్త్వవిచారములు సేయుచుండఁగా గబీ రది తెలిసికొని యా స్వామినిఁ జేరి జ్ఞానోపదేశము నందవలెనని యెంచి యొకానొక శుభదినంబున నుషఃకాలమున గంగయందు నిమజ్జనుఁడై మఠములోని కరుగఁబోయెను. శిష్యులందఱు నీతని ముసల్మానునిగా నెఱింగి లోనికి రానీయలేదు. విచారగ్రస్తుఁడై యాతఁ డనుదిన మట్లే వెడలుచు, శిష్యులతో వాదోపవాదములు సేయుచు, నిజాశయంబును వెలిబుచ్చెను. రామానందస్వామి యీ బాలునిఁ జూచియు, నతని వాదోపవాదముల నప్పుడప్పు డాకర్ణించియుఁ బ్రీతుడయు ను శిష్యబృందమువల

నతఁడు యవనవంశోద్భవుఁడని మెఱింగి వానిని దరికిరానిచ్చిన నిజకర్మలు చెడునని యెంచి వానికి దావొసంగలేదు. సత్పురుషులు కార్యసాఫల్యము బొందువఱకును దమ యత్నముల వీడరుగదా! కబీరు హిందూమతమును నమ్మి కాఫరగుచుండె నని, తలిదండ్రులకును, మతస్థులకును, దెలిసెను. వారంద అనేకవిధములఁ గబీరును నిర్బంధింపసాగిరి. గారాబుకొమరుఁ డగుటచే దండ్రిమాత్ర మేమియు నాతని ననుటలేదు.

ఒకానొక దినమునఁ గబీరు నిశ్చలహృదయుఁడై కోడి కూయువేళకు లేచి గంగానదికేఁగి యుషస్స్నానము గావించిఁ రామానందస్వామి స్నానమునకువచ్చు గంగాఘట్టమున నొక మెట్టుపై బరుండెను. శిష్యసమూహముతోఁ గనుచీకటియందు రామానందస్వామి యఘమర్షణస్నానము నిమిత్తము వచ్చుచు నా బాలునిపై నడుగు పెట్టెను. బాలుఁడు, 'హతోస్మి' యని యఱచెను. రామానందస్వామి 'రామరామ' యని యులికిపడి యెవరికో కీడుచేసితినని నొచ్చుకొనుచు బాలుని లేవనెత్తి వాని చెవియందుఁ దారకమంత్రము నుపదేశించి తన దారి వెడలి పోయెను. కబీరు నేటికి ధన్యుఁడనైతినని సంతోషమున శ్రీరాముని యందమిత భక్తిపరాయణుఁడై సదా మంత్రోచ్చారణమునఁ గాలము గడుపుచు నైహికమును మఱచిపోయెను. అనుదినమును మఠద్వారమున నాసీనుఁడై గురుబోధనల నాలకించుచు, భక్తిపారవశ్యమునఁ గీర్తనలు, పద్యములు, దండకములు స్తవరూపమునఁ జెప్పుచు, భజనలు సేయుచు నానందాబ్ధి నోలలాడుచుండెను.

ఒకనాఁడు గురూత్తముఁ శిష్యజనమునకు గీతాభాష్య

మును జెప్పుచుండెను. యోగవిద్యయు దాటితేటి సిద్ధినంది యార్యావర్తమునంతను వాదంబునగెలిచిన తారకాసురుఁడను నొక సిద్ధుఁడువచ్చి మఠపురోభాగంబున నొక యెత్తైన త్రిశూలమును బాతి పద్మాసనము వేసికొని, వాయువుల బంధించి యోగసమాధినిఁ గూర్చుండి, తన్ను వాదంబున గెలిచి పీఠాధిపత్యమును నిలుపుకొమ్మని రమ్మని రామానందునకు వార్త నంపెను. రామానందునకు యోగశాస్త్రముపై నిరసనము. అది దొమ్మరివిద్యవలె కాయసాధనమున కనువగును గాని యాత్మసాధనను గూర్పఁజాలదని యాతని నమ్మకము. కావున రామానందస్వామి, 'వాని నీవిద్యయం దెటుల గెలవఁగలనా!' యని చింతించుచు లోపలినుండి బయటకు రాకుండెను. శిష్యులందఱును గురునకుఁ గలిగెడు గౌరవభంగమునకై చింతించుచుండిరి. కబీరీసంగతివిని సాహసంబున లోనికరిగి రామానందస్వామి యడుగుల కెఱఁగి 'గురూజీ! మీ కీచింతవలదు. నన్ను దీవించిపంపినచో నీమూఢుని గెలిచివత్తు' ననెను. రామానందునకు విస్మయము తోచినది. ఈ కుఱ్ఱనికిఁ దాను గురు వెట్లయినదియుఁ దెలియలేదు. కష్టకాలమున నడ్డుపడువాఁడే ప్రాణప్రియుఁడని యాతఁడు తలచెను. వెంటనే 'విజయసిద్ధిరస్తు' అని యాశీర్వదించి యా బాలు నంపెను. కబీరు తారకాసురుని ముందునకు వచ్చి నిలిచెను. వేయిమందిశిష్యులును బురజనులు గుమికూడి 'యీచిత్ర మేమియో' యని చూచుచుండిరి. కబీరొక పట్టుదారపు టుండను జేతఁ దీసికొని శ్రీరామునిధ్యానించి దాని కొనను జేతఁబట్టుకొని పై కెగురవేసెను. తోడనే యాదారము పైకిఁ బ్రాకి దాని కొనపై సింహాసనారూఢుఁడై కూర్చుండి

తారకా! నన్ను గెలిచి మదీయగురూత్తముని గెలువనగును, అనిపలికెను. 'ఆర్యావర్తమంతయుఁ దిరిగినను నిట్టిపాటు సంభవింపలేదే,' యని యెంచి తారకుఁడు భయమంది కబీరుని యుక్తుల కోడిపోయి వాని త్రిశూలము నూడబెఱికికొని కబీరుని పాదముల కెఱగెను. కబీరు వానిని గురూత్తమునికడకుఁ గొనిపోయెను. రామానందుఁ డానందపరవశుఁడై దారకునకు యోగవిద్య నిరర్థకమని తెలిపి తారకమంత్రమే ముక్తిశరణ్యమనిబోధించెను. తారకుఁ డానందించి రామానందునిశిష్యుఁడై వానినిఁ గొలువసాగెను. రామానందుఁడు కబీరుని బిలిచి వాని వృత్తాంతము నడిగెను. కబీరు తారకమంత్రమును దా నుపదేశమందిన విధమును జెప్పెను. విప్రుఁ డమితానందపరవశుఁడై నాఁటినుండి వానిని ముఖ్యశిష్యునిగ భావించి ప్రేమాతిశయంబున వానిభక్తికి దోహదము గావించుచుండెను.

తమాలు కీ సమాచార మంతయుఁ దెలిసెను. కుమారుఁడు కులభ్రష్టుఁ డయినాఁడని తలిదండ్రులు చింతింపసాగిరి. త్వరలో నెట్లయిన వివాహముచేసిననేగాని కబీరు కుదుటపడఁడని వారు భావించిరి. వారి గ్రామమునందు 'కమాల్' అను ధనికుఁడు కలఁడు. ఆయనకు సుందరి యను కొమరిత గలదు. ఆమె గుణరూపములందును సుందరియే! కమాలు మిగుల ధనికుఁడు. రాజఠీవి గలవాఁడు. కుమార్తె యుక్తవయస్కురాలగుటచే వివాహము చేయవలెనని యత్నించుచుండెను. సుందరి చిన్నతనంబునుండియు శ్రీరామమందిరముల జరుగు భజనలకును, దేవోత్సవములకును వెళ్లి భక్తిమై సేవించుచుండెను సుందరి కబీరుని గుణగణంబుల వినియు, నాతని రూపసంపదల

నాతని కుమార్తెను గబీరునకిచ్చి వివాహము సేయుమని యడిగెను. కులభ్రష్టుఁడయిన కబీరునకుఁ దనకుమార్తె నీయనని కమాలు బదులుసెప్పెను. తమాలు మొగము చిన్నబోయి వెడలిపోయెను. సుందరి కాపలుకులు హృదయశల్యములాయెను. నాఁటినుండియు నామె వైఖరి మాఱినది. అన్నపానీయములం దహితమును, బరధ్యానమును నామెకు మెండాయెను. తల్లికిఁ గారణము తెలిసెను. ఆమె తండ్రితోఁ జెప్పెను. ఒకానొకదినమునఁ గమాలునకు హితుఁడగు నొక ఫకీరు వచ్చెను. కమాలు కుమార్తె వివాహవిషయమును గుఱించి వానితో ముచ్చటించెను. ఆతఁడు కబీరుని గుణములం బొగడి యాతనికిచ్చి వివాహము గావింపుమని చెప్పెను. తోడనే కమాలు మొఖీమునకు వార్త నంపి కబీరును బిలిపించి తన కుమార్తెయగు సుందరి నాతని కొసంగి వివాహము వైభవముగాఁ జేసెను. సుందరీకరుబీలు గృహప్రవేశమై సుఖముగాఁ గాపురము సేయుచుండిరి. వారిరువురును శ్రీరామపాదారవిందామృతపానము చేయుచు సంతోషముగఁ గాలముఁ గడపుచుండిరి.

ముసల్మానులకుఁ బక్రీదను పండువు ముఖ్యమైనది. నాఁడు గోహత్యజేసి యా పలలము నల్లాకు నైవేద్యమొసంగిన మోక్షము గలుగునని వారి నమ్మిక. ఆ పండుగదినమున మహమ్మదీయప్రపంచ మంతయు హింసారూపమే. కబీరు బక్రీదుపండుగదినమున నత్తవారింటి కరిగెను. కమాలు మతాచారయుక్తముగ విలువగల చక్కనిగోవును గొని యింటఁ గట్టి వేసియుంచెను. పండుగనాఁటి యుదయమునఁ గత్తినిజేకొని

గోవును హననము సేయ నుద్యమించెను. కబీ రది చూచెను. కన్నులుమూసికొనెను. శ్రీరాముని ధ్యానించెను. కమాలుని పాదములపైఁ బడి గోవును జంపవలదని బ్రతిమాలెను. అహింసాతత్త్వము నుపదేశించెను. కమాలు ఖురానువిధులను గూర్చి కబీరుతో మాట్లాడెను. కబీరు హింసవలనఁగలుగు పాపఫలములను బోధించెను. కబీ రపరిమిత చింతాక్రాంతుఁడై యా గృహమును విడువఁబోయెను. కమాలు, 'రామభక్తి యున్నచో, రాముఁడు దేవుఁడైనచో నీ శక్తినిఁజూపి గోవును బ్రతికింపు' మనియెను. కబీరు భక్తిపరవశంబున నీరములఁ గేలఁగయికొని, శ్రీరామునిస్మరించి తారకమంత్రము నుచ్చరించి గోవుపైఁ జల్లెను. ఆవు 'అంబా' యని యఱచుచు నిలువఁబడెను. కమాలుని బంధువులును నివ్వెఱవోయిరి. కబీరు నందఱును వేనోళ్ళఁ బొగడిరి. కమాలు హిందూమత సత్యము నామోదించెను. అహింసావ్రతమును బూనెను. తానును రామభక్తుఁడై రాముని సేవింప నారంభించెను.

మహాల్ అను గ్రామమున విశ్వనాథవర్మ యను నొక వైశ్యాగ్రణి గలఁడు. తండ్రి గతించినదాది దుర్వ్యసనములకు లోనై పరస్త్రీలపాల రాక్షసుఁడై దురాచారములకునికిపట్టయి వెలయుచుండెను. ఆయనపేరు విన్నవారందఱును నసహ్యపడువారలే. కాని గ్రామమునందు ధనికుఁడగుటచేతను, పెట్టుబడి పెట్టువాఁ డగుటచేతను పలుకుబడి గలిగియుండెను. ఈ దుర్మార్గునకు సుందరిపై మోహముగలిగెను. మహాపతివ్రతయగు సుందరి నెట్టులయినఁ జెట్టపట్టవలయునని యత్నము జేయసాగెను. పొరిగింటి యమ్మలక్కలచేత దుష్టసందేశముల

నంపియు, దాను స్వయముగా మాటలాడియు సుందరికి హృదయతాపమును గూర్చుచుండెను. నిప్పునకు జెదలంటును గదా! సుందరి శ్రీరామభక్తిపూరితమానసయై పతియే దైవమని నమ్మి కాలముఁబుచ్చుచుండెను. ఒకానొక దినమునఁ గబీరు భార్యాసహితుఁడై కాశీనగరమునకేఁగి గంగానదియం దవగాహమొనరించి విశ్వనాథుని దర్శించెను. తదుపరి తన గురువరుఁడగు రామానందస్వామివారి దగ్గఱకు సుందరినిఁ దోడుకొనిపోయియాతని కామెను జూపెను. ఆ విప్రుఁ డానంద పరవశుఁడై యామె వదనమునఁ బ్రతిఫలించుచున్న పాతివ్రత్య తేజమును, హృదయమునఁ బాదుకొనియున్న రామభక్తిని నెఱింగి యామెకు హితబోధ జేయనెంచి, 'బాలా! నీకెక్కువ చెప్పవలసిన దేమియులేదు. జపతపాదులను మించినదియు, లోకమునందు గీర్తినిఁగూర్చి యంత్యమున ముక్తిఫలమిచ్చు నదియుఁ బాతివ్రత్యమే సుమీ! నీ భర్తయే నీకేడుగడ. ఆయన మాటలను జవదాటక నడచుచుండుము. నీకు శుభ మగుఁగాక' యని యాశీర్వదించి పంపివేసెను. కబీరు భార్యా సహితుఁడై నిజగృహమున కరిగెను. భూలోకమున భక్తుఁడు కడు దరిద్రుఁడు. కబీరుని గృహమందు భుక్తికేమియునులేదు. తాను నేతమూలమున సంపాదించు స్వల్పవిత్తమున ముదుసలు లగు తలిదండ్రులను జాగరూకతతోఁ బోషించుచు రామకార్య ముల నొనర్చి తా నుపవాసము సేయుచుండెడివాఁడు. నాఁటి రాత్రి కబీరు రెండుజాముల దనుక రామభజన సేయుచు నానందమున మునిఁగియుండెను. సుందరియు నతనితోఁబాటు రామమందిరమునఁ బాటలు పాడుచుండెను. వారి కించుక

కునుకు వచ్చినది. మూఁడవ యామమునఁ దలుపు దట్టినట్లు శబ్దము వినఁబడెను. కబీరు లేచి తలుపుతీసెను. 'ఆకలి-ఆకలి, అన్నము-అన్న'మనుచు గొందఱు ఫకీరులు గనుపించిరి. ఎంత మందియుండిరో మాతనికిఁ దెలియలేదు. కబీరు గృహమునం దేమియు వ్యంజనములు లేవు. సుందరి నిదురలేచి తొందర పడ సాగెను. కబీ రామెను శాంతపఱచి ఫకీరులను వాకిట నిలిపి తాను విశ్వనాథు నింటి కరిగెను. తనకుఁగావలసిన వ్యంజనములఁ దెలిపి, తన గృహంబును గుదువబెట్టుకొని వాని నీయుమని కోరెను. విశ్వనాథుఁ డిదియే యదనని సుందరినిఁ దనకుఁ బంపినచో నిత్తుననెను. కబీ రటులే యని చెప్పి పదార్థములఁ గొనివచ్చి యింటనిచ్చి భార్య కీవార్త దెలిపెను. ఆమె దుఃఖించెను. కబీరు నాజ్ఞ చొప్పున నామె సంచరింపవలెను గదా! కబీ రామెకు నూతనవస్త్రాభరణంబుల నలంకరింపఁజేసి తాను వెంటఁగొని విశ్వనాథునియింట విడిచివచ్చెను. ఫకీరులు క్షుద్బాధచే నకనకలాడుచుండిరి. కబీరు గృహమునకువచ్చి ద్రవ్యములను పచనముసేసి భక్ష్యయుతముగా భోజనములఁ బెట్టుచుండెను. ఫకీరు లంద ఱానందముగా భుజించుచుండిరి.

విశ్వనాథుఁడు నేఁడు తన పంట పండినదిగదా యని శరీరమెఱుఁగనిమోహోద్రేకమున నువ్విళులూరుచు నదివరలో శయనగృహంబున నలంకరింపబడియున్న శయ్య కామెను బలవంతముగాఁ దార్ప యత్నించుచుండెను. వీధిగుమ్మమువద్ద నెవరో దలుపు తట్టుచుండిరి. విశ్వనాథుఁడు వెళ్ళి తలుపులను దీసెను. కొత్వాలు తనయనుచరులతోఁ జేత వెండిబెత్తమును బట్టుకొని లోపలకుఁ బ్రవేశించెను. వర్తకునకు గుండె లవిసినవి.

నోట మాటరాలేదు. కొత్త్వాలు బెత్తమున వర్తకుని మోదుచు 'నీ స్త్రీ యెవ'రని గద్దించి యడిగెను. విశ్వనాథుఁడు మాఱు పలుకక గజగజలాడసాగెను.

కొత్త్వాలు తిరిగి వానినిఁ దండించుచుఁ బరస్త్రీ యీ యామమున నీయింటనుండఁ గారణమేమని బిగ్గఱగా నడిగెను. 'అయ్యా! ఈమె నాసోదరి. ఈమెకుఁ బసుపుకుంకుమ బెట్టుటకు మా యింటికిఁ దీసికొనివచ్చితి' నని బదులు చెప్పెను. 'అటులయిన నిపుడే పసుపు కుంకుమ బెట్టు' మని కొత్త్వాలాజ్ఞాపించెను. వర్తకుఁడు పెట్టెను దీసి క్రొత్తచీరను దెచ్చి పసుపు కుంకుమతోఁ గట్టఁబెట్టి యామెకు నమస్కరించెను. కొత్త్వాలు 'ఆమె నామెయింట నిప్పుడే దిగవిడిచి రావలె' నని చెప్పెను. విశ్వనాథుఁ డామెను వెంటఁదీసికొని కబీరు నింటికిఁ బోయి యామె నొప్పగించి కబీరుని జూచి 'నీవు చేసిన మోసము తెలిసినది. నాకు నీభాగ్య నప్పజెప్పి, కొత్త్వాలునకు ఫిర్యాదు చేసితివే! కానిమ్ము. నిన్నుఁ దుదముట్టింపక విడువ' నని బెదరించి వెడలిపోయెను. భోజనము చేయుచున్న ఫకీరులందఱేక కాలమున నదృశ్యులైరి. ఈ చిత్రము కబీరునకుఁ దెలియలేదు. తెల్లవారినది. గ్రామమునందుఁ గలవరముసాగెను. కబీరు కొత్త్వాలింటికి వెడలి 'యేల మీ రట్లు విశ్వనాథుని శిక్షించితి'? రని యడిగెను. కొత్త్వాలు తెల్లఁబోయెను. తాను పదిదినముల నుండియు గ్రామమున లేననియు, నప్పుడేవచ్చితిననియు, దా నేమియు నెఱుఁగననియు జెప్పెను. కబీ రిదంతయు శ్రీరామమాహాత్మ్యమని గ్రహించెను. విశ్వనాథునకుఁ గబీరుపైఁ గోపము పోలేదు. కబీరు విశ్వ

నాథున కిది యంతయు జెప్పి 'రాముఁడే యల్లు ప్రత్యక్ష మైనాఁడనియు, నీవు ధన్యాత్ముఁడ' వనియు నుడివెను. విశ్వనాథునకు మనస్సు మాఱిపోయినది. భగవద్దర్శనము ఫలశూన్యము కాదుగదా! విశ్వనాథునకుఁ దారకమంత్రము నుపదేశించెను. విశ్వనాథుఁడు శ్రీరామభక్తుఁడై కబీరునకు శిష్యుఁ డాయెను.

భద్రాద్రిగుడిని బాగుచేయించిన రామదాసు కబీరుని శిష్యుఁడే! కబీరునకుఁ దలిదండ్రులు గతించిరి. వారల కుచిత విధులఁ గర్మకలాపములఁ జరిపి, వారలకు ముక్తిమార్గమును గలుగఁజేసెను. కబీరు మక్కా-పట్టణమున కేగి యచ్చట మహమ్మదీయులకు హిందూమత తత్త్వ మెఱుకపరచి, యహింసా తత్త్వమును బోధించెను. రామభక్తియందగ్రగణ్యుండని దిగంత విశ్రాంతకీర్తిని గడించి, సుందరితో గూడ కబీరుదాసు బొందితో దేవవిమానమున శ్రీరామసన్నిధిఁ జేరెను.

భక్తికి స్థలనిర్ణయ ముండదు.

# ౫. శౌర్యాగ్ని

కం॥ విదలింప నుఱుకు సింగపుఁ
గొదమయు మధుమత్తగంధకుంజరములపై
నది బలశాలికి నైజము
గద! తేజోనిధికి వయసు కారణ మగునే!

పౌరుషవంతుఁడే ప్రధానపురుషుఁడు. శౌర్యరహితుని నందఱును జులకనగఁ జూతురు. 'కత్తిలేనివాని గోత్రమైనను గలుచు' నను సామెతను వినుముగదా! ప్రపంచమున వీర రసము శూన్యమయినచోఁ జరిత్రలు, పురాణములు, కథలు సున్నయగును. ఐహికవాంఛలను సఫలము గావించుకొని కీర్తికాంతను జేపట్టుటకు శౌర్యమే ప్రధానబలము. రాజ్యముల సంపాదించుట, పాలించుట, వృద్ధియొనర్చుట, ధర్మమును స్థాపించుట మున్నగుకృత్యములు శౌర్యముననేగదా సాధ్యము లగుచున్నవి! శ్రీమహావిష్ణువు లోకమున ధర్మసంస్థాపనార్థము శౌర్యప్రధాన మగు నృసింహ పరశురామా ద్యవతారముల నెత్తియుండుట లోకవిదితమే గదా! షట్చక్రవర్తులు, రాజాధి రాజులు, మంత్రివరులు, యోధపుంగవులు శౌర్యరసవిస్ఫూర్తిచే నపారమైన కీర్తిగడించి, వీరస్వర్గమును జూరగొనినవా రెందఱో మన హిందూదేశమునఁ గలరు.

కృష్ణానదికి దక్షిణభాగమున గుంటూరుజిల్లాలోఁ బల్నా డను తాలూకా గలదు. ఇది పల్లవులచే నాక్రమింపఁబడి పల్లవనాఁడను పేరంది కాలక్రమమునఁ బల్నాఁడని వ్యవహరింపఁ బడుచున్నది. మన కథాకాలమునాఁటికి గురువిందమును

(గురజాల) రాజధానిగఁ జేసికొని యీ పల్నాటిసీమ నలుగు రాజు పాలించుచుండెను. ఈ భూకాంతునకు మైలమదేవి, వీర విద్యాదేవి, భూరమాదేవి యను మువ్వురు భార్యలు గలరు. కాలక్రమమున మైలమదేవికి నలగామరాజు, వీరవిద్యాదేవికిఁ బెదమల్లదేవాదు లను ముగ్గురు సుతులును, భూరమాదేవికిఁ కామరాజాదులను నలుగురు కుమారులును జనించిరి.

చిట్టగామాలపా డను గ్రామమున రామిరెడ్డి యను నొక రైతున కతని పొలమునకు సమీపమున నొక పొదయం దొక యాడుశిశువు దొరకెను. అతఁ డామెను గడు గారాబ ముతోఁ బెంచి యామెకు నాగమ్మ యను నామకరణముఁ జేసెను. ఆ బాలిక వచ్చినదాదిగఁ దనకు లాభకరంబుగ నుండుటచే నామెను మిక్కిలి ప్రేమించుచుండెను. ఆమెకు వివాహోచితకాలము వచ్చినతఱి నొక ధనికుఁడగు కులీనున కిచ్చి వివాహము గావించెను. కాలవశమున భర్తయుఁ, గతించుటచే మిగుల వగచి లోకజ్ఞానము గడించిన దగుటను, ధనము గలదియగుటను నామె యలుగురాజు ప్రాపకమును సంపాదించెను.

ఈ రాజశేఖరుని రాజ్యకార్యముల నిరాటంకముగ నిర్వహించి మేటి కీర్తిగాంచిన మంత్రి దొడ్డనాయఁ డొండు గలఁడు. అతనికి బ్రహ్మనాయఁడు, బుద్ధనాయఁడు నను కుమారులు గలరు. నాగాంబ పన్నిన దుస్తంత్రముల బలిమిని నలుగురాజునకుఁ గాలక్రమమున దొడ్డనాయనిపై ద్వేషము జనించెను. మనస్పర్థలు, నంతఃకలహములు నానాఁటికి రూఢమై, విపులమై, వృద్ధియగుటం జేసి తనపుత్రుఁడగు బ్రహ్మ

నాయని మంత్రిగ నియమించి రాజ్యాంగవ్యవహారముల నుండి దొడ్డనాయఁడు తనకుఁ దా మఱలెను. నాగాంబ రాజును వశీకరణముఁ జేసికొని కీలుబొమ్మవలె నాడింపసాగెను. కాలము తీరినది. అనుగురాజు మరణించెను. కృత్రిమవర్తనల మిన్నయయిన నాగాంబ యనుగురాజు పిదప సింహాసన మధిష్ఠించిన నలగామరాజును స్వైవసము జేసికొన వేచియుండెను. ఒక దినమున నలగామరాజు సపరివారముగ మృగయా విహారార్థమై చని తిరిగి వచ్చుచుండగాఁ ద్రోవమధ్యమున నొక చలువపందిరి వేయించి వారల కనుకూలములగు పదార్థములతో వారలకుఁ దనివితీఱ నాగాంబ విందొసంగెను. ఆమె యకారణవాత్సల్యమున కలరి యామె కోరినదెల్ల నిచ్చెదనని రాజామెతో నుడివెను. చిరకాలమునుండి తన హృదయమున నిగూఢముగ నాఁటియుండిన బ్రహ్మనాయనియందలి పగఁదీర్చుకొను సమయము చిక్కెఁగదా యని కడు ముదంబున నాగాంబ మంత్రిపదవిఁ నధిష్ఠింప ననుజ్ఞ వేఁడెను. నలగాముఁ డందుల కొడంబడి యామెకు మంత్రిపదవి నొసఁగెను.

నాఁడుమొదలు నాగాంబ నాయకురాలై రాజ్యాంగములఁ ద్రిప్పుచుండెను. బ్రహ్మనాయని బురంబునుండి వెడలఁ గొట్టించుటకును, నలగామరాజు సోదరుల నంతమొందించుటకు నామె వేయివిధములఁ దనబుద్ధికొలఁది యత్నించుచుండెను. ఇదియంతయు నెఱిఁగి బ్రహ్మనాయఁడు తనకును, రాజసోదరులకు నటనున్నఁ గీడుమూడునని యెంచి వారల భాగము వారి కిప్పించి, వారితో మాచర్లకు వెళ్ళి నివసించుచుండెను.

నాగాంబకు బ్రహ్మనాయనిపైఁ గోపము మఱింత పెఱిగెను. ఎటులయినను వారినాశముఁ జూడగోరి నాగాంబ నలగామరాజును బ్రోత్సహించి కోడిపందె మొందు నెలకొల్పి దానికి రాజసోదరులను, బ్రహ్మనాయని పిలిపించెను. పందెమునకుఁ బోవుట పాడిగాదని యెఱింగియు, పిలువఁగాఁబోకుండ రాదనియుఁ దలంచి బ్రహ్మనాయఁడు రాకొమరులు వెంటరాఁ బందెమునకై వెడలెను. పందెమున నోడువారేడుసంవత్సరములు బ్రవాసముండి రావలయునని వారు షరతు నేర్పాటుచేసికొనిరి. పందెమున మాయజేసి నాగాంబయే గెలుపొంద, నియమప్రకారము మల్లిదేవాదులు, బ్రహ్మనాయఁడు ప్రవాసమొనర్చి తిరుగ రాజ్యమునుబొందుటకై రాయబార మంపిరి. నలగామరాజునల్లుడును, రాచమల్ల బిరుదాంకితుడునునగు నలరాజు రాయబారిగ జనెను. 'సమయముపూరించి తిరిగి తమ రాజ్యమునఁ బ్రవేశింపనుండి మల్లిదేవాదులు భవదనుజ్ఞఁ గోరుచున్నా'రని దూత పలుక, నాగాంబ కొండెములకుఁ జెవియొగ్గి యామెకు పశంవదుడైన నలగామరాజందుల కియ్యకొనలేదు. తిరిగివచ్చుచుండ నలరాజు నాగాంబప్రేరితులయిన కొందఱుఘాతుకులచేఁబడి మడిసెను. బ్రహ్మనాయఁ డీవార్తవిని క్రోధోద్దీపితమానసుండై మల్లిదేవాదుల యుద్ధమున కాయితులఁజేసి యుద్ధవార్తనలగామరాజునకుఁ దెలియఁజేసెను. ఉభయపక్షబలంబులు కార్యమపూడియొద్దఁ గూడినవి. ప్రాణములపై నాశవీడి ఘోరరణముచేయ నందఱు నుంకించుచుండిరి.

వీరాగ్రేసరుఁడును, ధర్మవర్తనుఁడును నగు బ్రహ్మ నాయనికి నైతాంబ యను వీరపత్ని గలదు. వీరిరువురి పుణ్యముల పంటయో యన, లేక లేక నొక కొమరుఁడు గలిగెను. తల్లిదండ్రులు వానికి బాలచంద్రుఁ డని నామంబిడి, యల్లారు ముద్దుగఁ బెంచుచుండిరి. చిన్నవయసుననే యాతనికి వివాహ మాయెను. బ్రహ్మనాయఁడు యుద్ధమునకుఁ బోవు సమయమున బాలచంద్రుఁ డింటలేఁడు. చిన్నవాఁ డయినందునఁ గ్రీడలయం దాసక్తుఁడై యుండెను. ఒకనాఁడు తోడిబాలురతో వీథియందు బాలచంద్రుఁడు బొంగరము లాడుచుండెను. ఆ సమయమున నీటికెనెత్తుకొని వచ్చుచున్న యొక వైశ్యాంగన కాలికి బొంగరముతగిలి గాయమాయెను. అంత నామె కోపగించి బాలచంద్రుని గద్దించి, 'నీ తండ్రి యుద్ధరంగమునఁ బ్రాణముల వీడ సంసిద్ధుఁడై యుండఁ బందవై యింటనుండి యాటలాడుచు మాబోటి యబలలమీఁదనా నీ ప్రతాపము చూపుట? చాలుచా' లని శల్యతుల్యము లగు పలుకుల నాఁడెను. ఆ వనిత పలుకులు మదికి ములుకులవలెనాట బాలచంద్రుని శౌర్యాగ్ని ప్రజ్వరిల్లెను. ఒక్కుమ్మడి నాటలయందున విచ్చ యదృశ్యమై రణకేళిసలుప నుత్సాహము పెంపొందెను. తోడనే తల్లియగు నైతాంబయొద్దకుఁ జని తండ్రిపోయిన రణరంగము నెఱిఁగి తన తలఁపు నామె కెఱింగించెను. పుత్త్రి ప్రేమ మనంబున బూర్ణమై పుత్త్రుని రణోద్యమమునుండి మఱల్ప వీరమాత కనుచితమైనను పలుమాటలు పలికె. కాని బాలచంద్రుఁడు తన సంకల్పమును మానున ట్లగపడలేదు. ఐతాంబ వానితో భార్య యనుమతిఁగొని రణంబునకు బొమ్మని

చెప్పెను. బాలచంద్రుఁడు మాంచాలయొద్దకుఁ జని తల్లి యానతిఁ దెల్పి తాను రణంబునకుఁ బోవ నంగీకారము నీయు మని యడిగెను. వీరపత్ని కనుగుణంబుగ నామె దానికి సమ్మతించెను. బాలచంద్రుఁడు తోడిబాలురకు శౌర్యోద్రేకముఁ గలిగించి వారల వెంటఁగొని రణరంగమున కరిగెను.

బ్రహ్మనాయఁడు కుమారుని రాక కచ్చెరువొంది, 'యేల వచ్చితి ?' వని యడిగెను. 'నాయనగారూ ! తమ్మిటకు దెచ్చిన రణవార్తయే నన్నుద్వేగపఱచి యిటకు తోడ్తెచ్చినది. పోరునకుఁ బూనివచ్చిన పురుషసింహులు మీర లిట్లు శాంతము వహించి యుంటకు గతంబేమి' ? యని తనయుఁ డడుగ బ్రహ్మనాయఁడు 'నాయనా! మన శౌర్యమునకు జంకియో, రణమున నష్టమగుననియో, సోదరులపైఁ బ్రేమం జేసియో, మఱి యెందులకో నలగామరాజు నాగాంబతో నాలోచించి వా రందఱి యనుమతిని రాయబార మంపెను. మల్లిదేవాదు లందుల కియ్యకొనిరి. అందుచే సంధికై రాయబారములు జరుగుచుండెను. రణమందులకై విరమింపఁబడిన' దని పలికెను. ఆ పలుకులు బాలచంద్రునికి ములుకులవలె నాటెను. తండ్రిమ్రోల మాఱాడఁ జాలక మల్లిదేవాదులకడ కరిగెను. అచ్చోట రాజులందఱు సభదీర్చి సమరచర్చ సేయుచుండిరి. బాలచంద్రుని రాకకు మల్లిదేవాదు లాశ్చర్యముఁ జెందిరి. అరుణనేత్రంబుల బాలచంద్రుఁడు వారినిఁ బాఱఁ జూచి, 'పాఱుఁబోతులారా! రాజనామము మీ కలంకారమాత్ర మయ్యెనే! బూటకపుఁ గోడిపందెమున మీరు రాజ్యము గోల్పోయిన విషయము జ్ఞప్తియందు లేదా ? రాయ

బారి యేమయ్యెనో మఱచితిరా ? సంధిమాట కేమి శౌర్య పరాక్రమములు లేవా ? సమరమునకుఁ జంకు జనించెనేని మీరు వెనుకకుఁబొండు. నే నొకఁడనే యుద్ధమున శత్రుసంహారముఁ జేసివచ్చెద’ నని వారి నదలించెను. వాని మాటలు విని వారిలో గొందఱు యుద్ధమున కాయిత మగుచుండిరి. అది కని మఱల బాలచంద్రుఁడు “ఓ వీరవరులారా ! రణమున జయాపజయములు దైవాధీనంబులు. జయము గొందుమా రాజ్యసుఖమును బడయుదము. రణమున మడియుదుమా వీరస్వర్గమలంకరించెదము. కాన సంధిమాటలఁ ద్రోసిపుచ్చి రణమునకుఁ గడంగుఁ’ డని వారిని బ్రోత్సహించెను. వాని పలుకులు వారి హృదయముల శౌర్యరసపూరితములఁ జేయ నందఱు రణమున కంగీకరించిరి. బ్రహ్మనాయఁడు కొమరుని వాక్యముల నాలకించి నిరుత్తరుఁ డయ్యెను. యుద్ధము సాటింపఁబడెను. నలగామరాజు మున్నగువారు సంభ్రాంతులయిరి.

ఇరుతెగలవారును సమరమునకుఁ దొడంగిరి. తిరిగి యుద్ధ మారంభమాయెను. బాలచంద్రుఁడు కరవాలముఁబూని మూర్తీభవించిన శౌర్యరసంబో యన, భీకరమూర్తితోడఁ గమలాకరంబు నడుమ మత్తగజంబువోలెఁ బరవీరులందఱు బాలచంద్రుని ప్రతాపానలజ్వాలల కాహుతి యయిరి. కొంతదనుక బాలవీరునిఁ బోర నెదిరింప శత్రుపక్షమున నెవరును సాహసింపరైరి. ఇతని శౌర్యాగ్నిస్ఫూర్తికి వెఱచి కొందఱు కాలికి బుద్ధిచెప్పిరి. నలగామరాజు సేన లన్నియు జెల్లాచెదరై తిరుగుమొగమునఁ బాఱుచుండెను. ఆ సమయమున నతని సహోదరుఁడగు నరసింగరాజు తనసేనలఁ బురికొల్పికొని వచ్చి

భీకరంబుగ బాలచంద్రునిఁ దాకెను. యుద్ధము ప్రారంభమాయెను. నలగామరాజు బాలచంద్రునితో రణంబునకుఁ గడంగెను. ఇరువురకు భయంకరసంగ్రామ మయ్యెను. బాలచంద్రుని యసి చూపఱ కచ్చెరువు గొలిపెను. తుదకు సింహకిశోరంబు మత్తగజేంద్రంబుమీఁదికి లంఘించు చందంబున బాలచంద్రుఁడు నలగామరాజుపైకి నుఱికి తన నిశితకరవాలంబున కతని శిరము నేరఁజేసెను. ఖండితమస్తకంబు తన ఖడ్గంబునఁ గ్రుచ్చి బాలచంద్రుఁడు తండ్రియొద్దకుఁ జని చూపెను. మల్లిదేవాదులు దానికి వగచిరి. బ్రహ్మనాయఁడు పుత్త్రుని వీరత్వమును మెచ్చుకొనక పలుదూషణంబుల బాలుని నొనాఁడెను. 'మాటల కోర్వఁజాలఁ డభిమానసమగ్రుఁ' డన్నట్లు తండ్రిపలుకులకు దుస్సహపరితాపమొంది మఱల సమరంబునకుఁ గడఁగి పరవీరనికాయంబునెల్ల చెండాఁడి తుదకుఁ దానుగూడ వీరస్వర్గ మలంకరించెను. కాని యతని యశోమూర్తి శాశ్వతమై విలసిల్లుచున్నది.

మల్లిదేవాదులు బోరున సమసిరి. బ్రహ్మనాయని పక్షంబువారిచే బంధితయై నాగాంబ బ్రహ్మనాయని సన్నిధికి వచ్చెను. బ్రహ్మనాయఁ డామెను క్షమించి విడిచెను. రాజ్యమంతయు నలగామరాజుపరముఁజేసి బ్రహ్మనాయఁడు తపోవనమున కేఁగెను.

శౌర్యము కీర్తిదాయకము గదా !

# ౬. కవీశ్వరుఁడు

కం॥ సుకృతాత్ములు రససిద్ధులు
సుకవీంద్రులు విజయనిధులుసుమ్ము తదీయా
ధిక కీర్తిశరీరంబులు
ప్రకటజరామరణజన్మభయరహితంబుల్.

సృష్టికి బ్రహ్మవలె భావనాప్రపంచసృష్టికి కవియే బ్రహ్మ. నిశితధిషణాలసితుఁడయి ప్రపంచమునఁ దనతీక్ష్ణదృష్టిఁ జొనిపి యందలి తత్త్వమునరసి సృష్టికిఁ బ్రతిసృష్టిఁజేయు సమర్థుఁడే మహాకవి. 'కవిక్కాంచనిచో రవి కాంచ నేర్చునే?' యను సూక్తి కలదు కదా! అవాఙ్మానసగోచరంబగు నీశ్వర తత్త్వముగూడ కవితత్త్వాన్వేషణదృష్టి విషయమే! మహాశయుండగు త్యాగరాజు నిరుపమానంబులగు కృతు లొనరించి భక్తిరసప్రవాహము వెల్లివిఱియఁజేసె. ఆంధ్రభాషాయోషను దనమృదుమధుర వచనరచన నలంకరింపఁజేసి ఈశ్వరతత్త్వమును భక్తిరస ప్రపూర్ణముగ బ్రబంధరూపమున వెల్లడిజేసిన మహాకవులలో నగ్రగణ్యుఁడు పోతనామాత్యుఁడు. ఆతని జీవిత చరిత్రమును స్మరించినవాని జన్మమే జన్మముగదా!

పవిత్రమై రమ్యమైయొప్పు నేకశిలానగరంబునఁ గేసన యను నియోగిబ్రాహ్మణుఁ డుండెను. అతఁడు కౌండిన్యసగోత్ర సంభూతుఁడు. పవిత్రచరిత్రుఁడు. అతనిభార్య లక్కమాంబ. పరమసాధ్వి. పవిత్రదంపతులకు ద్వితీయపుత్త్రుఁడే యీ పరమభాగవతోత్తముఁడు నా వెలసిన పోతనామాత్యుఁడు. ఈ

వంశమువారు కులక్రమాగతంబైన శైవదీక్షాపరతంత్రులై శంకర పాదారవిందధ్యానాసక్తులై భగవద్భక్తులై యుండిరి. పోతన బాల్యమునుండియు నీశ్వరారాధనలోలుఁడై యుండెడి వాఁడు. తలిదండ్రులు పిన్నతనముననే గతించియుండుటంజేసి యాతనికి జీవనము బహుకష్టముగ నుండెను. పశువుల నూరి బయలు ప్రదేశములకుఁ గొంపోయి మేపుకొని వచ్చుచు నతఁడు కాలము గడుపుచుండెను.

ఒకనాఁ డా పర్వతములపైఁ జిదానందయోగి యను నొక యోగీశ్వరునిదర్శించి, కడుభక్తిఁ బ్రణమిల్లి వానిమ్రోల నిశ్చలుఁడై పోతన నిలిచెను. యోగీంద్రుఁ డాతని మనశ్శుద్ధిని గ్రహించి కరుణార్ద్రచిత్తుండై బాలుని జేరఁజీరి శ్రీరామమంత్రోపదేశము గావించి దాని ననుష్ఠించువిధాన మరయఁ జెప్పెను. పోతన నాఁటినుండియు శ్రీరామభక్తాగ్రేసరుఁడై రామాయణపురాణగాథలఁ జదువుచు వైష్ణవభక్తుడై వెలయఁ జొచ్చెను. శ్రీరామ పాదారవింద ధ్యానమహిమను సహజ కవితాపాండితీగరిమ నంది కాలక్రమమున భాగవత పురాణ మాంధ్రీకరింపవలెనని యతనికిబుద్ధిపుట్టెను. సత్కార్యోపక్రమమునకు గంగాస్నాన ముపోద్ఘాతమని యరసి పోతనామాత్యుఁడు కాశీనగరంబునఁగల విశ్వేశ్వరదర్శనార్థము పయనమై యున్నతఱి భాగవతమును దన కంకితమును జేయుమని కోరుచున్నట్లు శ్రీరామచంద్రుని కలలోఁగాంచి యమందప్రమోద భరితుఁడై తనకృతిని నరాంకితముగాగాక రామాంకితముగ నొనర్చుటకే దృఢసంకల్పుఁడై యీశ్వరదర్శనము గావించుకొని వెంటనే తన గృహంబునకు మఱలివచ్చెను.

ఉ॥ ఎయ్యది కర్మబంధముల నెల్ల హరించు విభూతికారణం
బెయ్యది సన్మునీంద్రులకు నెల్ల కవిత్వసమాశ్రయంబు ము
న్నెయ్యది సర్వమంత్రముల నేలిన దెయ్యది మోక్షలక్ష్మిరూ
పెయ్యది దానిబల్కెదను హృద్యము భాగవతార్థమంత్రమున్.

అని చెప్పి పోతనామాత్యుఁడు భాగవతంబు వ్రాయఁ జొచ్చెను.

క॥ పలికెడిది భాగవతమఁట
పలికించెడివాఁడు రామభద్రుండఁట నేఁ
బలికిన భవహరమగునఁట
పలికెద వేఱొండుగాథ పలుకఁగ నేలా?

యని భాగవతరచనాసక్తిని శ్రీరామచంద్రునికే యర్పించి వాని దివ్యమంగళవిగ్రహాము మనఃపద్మంబున నిల్పి షష్ఠ్యంతంబులఁ దన గ్రంథమును దాశరథి కంకితకముగావించి కథాప్రారంభమున కుపక్రమించెను.

పోతన సామాన్యకుటుంబి యగుటవలన భుక్తిగడచుట కుపాధి యేమియు లేనివాఁడయ్యు భాగవతరచనాదీక్షయందు నిమగ్నుఁడగుటంజేసి తనకుంగల స్వల్పభూమిని సేద్యముఁజేసి యందలి పంట యెంతయినను శ్రీరామప్రసాదమని భావించి కుటుంబభరణంబునకై వేఱొండు ప్రయత్నములు సేయక భాగవతమును రచించుచుండెడివాఁడు.

కర్ణాటభూపతి పోతన భాగవతమును రచించుట కర్ణాకర్ణిఁగ నెఱిఁగి యా గ్రంథమును దన కంకితముఁ జేసిన నగ్రహార మిత్తునని వర్తమానమంపెను. పోతన బంధువులు,

మిత్రులు సంతసించి యాభూకాంతుని యనుగ్రహము వడసి దారిద్ర్యమును బాపికొనుమని పోతనకు నొక్కి చెప్పసాగిరి. పోతన వారి యుపదేశములకుఁగాని, భూపతి సందేశమునకుఁ గాని యేమియు మాఱాడక యూరకుండెను. మిన్నకుండుట యర్ధాంగీకార మని తలంచి యాతని మిత్రులా యత్నముఁ జేయఁబూనిరి. ఆ రేయి సరస్వతి కన్నీరు గార్చుచు పోతన యెదుట నిలువఁబడెను! కవీశ్వరుం డించుక విచారగ్రస్తుఁడై, తన గ్రంథమును భూకాంతునకుఁ గృతియొసర్చుట యొల్లక సరస్వతి కన్నులనీరు నించె నని నమ్మి,

ఉ॥ కాటుకకంటినీరు చనుకట్టుపయిం బడ నేలయేడ్చెదో
కైటభదైత్యమర్దనుని గాదిలికోడల! యో మదంబ! యో
హాటకగర్భురాణి! నిను నాఁకటికిం గొనిపోయి యల్లక
ర్ణాటకిరాతకీచకుల కమ్మ! త్రిశుద్ధిగ నమ్ము భారతీ!

యని సరస్వతిని యోదార్చునప్పటికి వికసితవదనారవిందయై సరస్వతి యంతర్హితయాయెను. అప్పటినుండియుఁ దన కవితా కన్యను పరాంకితముఁ జేయనని దృఢనిశ్చయుఁడై శ్రీరామునకే యంకితముఁ జేసెను.

ఒకానొకదినంబునఁ దనకుటీరంబునఁ గూర్చుండి భాగవతమున వరాహావతారఘట్టమును భక్తిపరవశమున వ్రాయుచుండెను. శ్రీమహావిష్ణువు శ్వేతవరాహరూపమున ద్వారముకడ నిలిచియుండెను. ఈ సమయంబుననే కర్ణాటప్రభువు పోతనను వంచించి భాగవతంబును గొనిపోవ ససైన్యంబుగ నెత్తివచ్చెను. వాకిటనున్న హరి పోతన కెఱుక లేకుండఁగనే కర్ణాటసైన్యమును దాకి చీల్చి పాఱఁదోలెను. ఘట్టరచనానంత

రమునఁ బోతన బయటకువచ్చి యా దృశ్యమును గానకున్నను వార్తను విని శ్రీపతికరుణా విశేషంబని ముదితాంతరంగుఁ డాయెను.

గజేంద్రమోక్షఘట్టమును వ్రాయుచుండఁగా వైకుంఠ పురంబు వర్ణించుచు 'అలవైకుంఠపురంబులో నగరిలో నామూల...' యని వ్రాసి యాపైని దోఁచక యా పుస్తకము నుంచి యింకొక కార్యమునకు వెడలెను. తిరిగి వచ్చునప్పటికి నాపద్యము పూర్తిగనుండెను. దీని కచ్చెరునంది యది యంతయు సరస్వతీప్రసాద మని యమందానంద భరితుఁ డాయెను.

ఒకదివసంబునఁ బోతన తన పొలమును దున్నుకొను చుండెను. ఆనాఁటిరాజుల కృపాకటాక్షములకుఁ బాత్రుఁడయి సిరులఁ దులదూఁగిన శ్రీమంతుఁడగు శ్రీనాథుఁ డందలంబున వచ్చుచుండెను. గర్భదరిద్రతచేఁ గుటుంబపోషణమునకై మడి దున్నుచున్న పోతనను జూచి యనాదరసూచకముగ 'బావా! హాలికులా మీరు ?' అని యడిగెను. పోతన యించుక కనలి, "బావా !

ఉ॥ బాలరసాలసాలనవపల్లవ కోమలకావ్యకన్యకన్
గూళలకిచ్చి య ప్పడుపుగూడు భుజించుటకంటె సత్కవుల్
హాలికులైన నేమి గహనాంతరసీమలఁ గందమూల గా
ద్దాలికులైన నేమి నిజదారసుతోదర పోషణార్థమై".

యని పలుక మనంబున పరితాపరోషంబులు పెనంగొన శ్రీ
నాథుండీసు దందడినిఁ బోతనను బరాభవింప నెంచి తన పల

కిని మోయుచున్న బోయలను దొలఁగుడని యాజ్ఞాపించెను. బోయలు మోయకున్నను నందలము పోవుచునే యుండెను. అది కని యించుకంతయు వెఱఁగందక పోతన భక్తిపారవశ్యంబునఁ బరాత్పరునిఁ జిత్తంబునఁ గీలుకొల్పి తన నాగటి యెద్దులను విప్పెను. శ్రీనాథుని యందలమట్లు పోతన నాగలియు దున్నుచునేయుండెను. పోతన మహిమకు శ్రీనాథుఁ డచ్చెరువంది యీసు భరంబునఁ గుందిన డెందంబుతోఁ జనియెను. కూలంకషపాండితీగరిమంబునకును, రచనాకౌశలంబునకును, లలితశైలికిని, మృదుమధుర పద్యములకును రసావేశమునకును, భక్తిపరతకును సమకాలిక పండితవరులు పోతన భాగవతమును వేనోళ్ళఁ బొగడ విని, శ్రీనాథుఁడు వెక్కసపడి యాతని గ్రంథమున లోపము వెదక యత్నించి, తుదకు పోతన తోడి సంభాషణమున నెగతాళిగ, "బావా! పరివారము లేక యాయుధములు లేక భక్తుని మొఱ నాలకించిన మాత్రమున ననాలోచితముగ నేమిచేయవలెనని, మొసలి నెట్లు ద్రుంచవలెనని, వేగిరించి విష్ణువు చనె?" నని గజేంద్రమోక్ష సందర్భమున 'సిరికిం జెప్పఁ' డనుపద్యము నాక్షేపించెను. అందుల కప్పుడు మౌనమే యుచితమని నిదానించి యూరకుండి పోతన కొంత కాలమునకు శ్రీనాథుని సకుటుంబముగాఁ దనయింటికి నాహ్వానించెను. ముందుగ భోజనమునుండి శ్రీనాథుని కుమారుని వేఱొకచోటున దాఁచి, నూతిలో నొక పెద్ద ఱాతిని బడవేసి 'బావా! రమ్మా, రమ్మా. నీకొడుకు నూతిలోఁబడె' నని యఱచెను. వజ్రాహతులఁబోలు నాపలుకులు విని శ్రీనాథుఁడు తక్షణమే భోజనము విడిచి పరుగుపరుగున నూతియొద్దకు వచ్చి

"యేఁడి ? యేఁడి ? యెక్కడెక్కఁడ ?" డని యాంతురతతో వేగిరపడెను. అంత ప్రశాంతముగఁ బోతన "బావా ! యేమని వచ్చితివి ? నిచ్చెన, త్రాళ్ళు, పరివారమెక్కడ ? ఎట్లు పిల్లవానిని దీసెదవు ? ఇల్లు చుట్టుతిరిగి కేకలు వేసిన పనియగునా"? యని గద్దించెను. శ్రీనాథుఁడు శూన్యదృష్టితో నేమియుఁ దోఁచక నివ్వెఱపడి చూచెను. అప్పుడు పోతన భక్తులపైని భగవంతునకుఁ గూడ నిట్టి వాత్సల్యమే యని కొడుకును జూపెను. శ్రీనాథుఁడు తనకుఁ దగినపరాభవ మైనదని సిగ్గుపడి, "బావా ! నీ రచన కెందును లోపంబులేదు. నావిమర్శనలు నీ గ్రంథమునకు వన్నె దెచ్చినవి" యని చెప్పెను. పిమ్మట పోతన

"మ॥ లలితస్కంధము, కృష్ణమూలము, శుకాలాపాభిరామంబు, మం
జులతాశోభితమున్, సువర్ణసుమనస్సుజ్ఞేయమున్ సుందరో
జ్జ్వలవృత్తంబు, మహాఫలంబు, విమలవ్యాసాలవాలంబునై
వెలయున్ భాగవతాఖ్య కల్పతరు వుర్విన్ సద్విజశ్రేయమై".

యన నొప్పిన నీ భాగవతమును పలికించెడివాఁడు రామచంద్రుఁడు గానఁ దాన నేలోపములున్నను వానివేగదాయని నుడివెను. ఇట్లు సరససల్లాపములతో నిద్దఱు స్వగృహంబున కరిగిరి. భాగవతప్రభావంబును, పోతనామాత్యుని భక్తిమహిమంబును వేంకటగిరిప్రభువగు రావుసింగభూపాలుఁడు కర్ణాకర్ణిగవిని పోతనను దన యాస్థానమునకుం బిలిపించి భాగవతమును దన కంకితముఁ జేయుమని వేఁడెను. పోతన "నరాంకితముచేసి సమ్మోట పోటులఁ బడఁజాలను. శ్రీరామున కది యంకితమయినది. కనుక మీకీయజాల"నని నిశ్చయముగ భూపాలునితో ననెను. రాజునకుఁ గోపమువచ్చి బలవంతముగఁ దన సైనికులచే నాతాటియా

కుల గ్రంథముఁ దెప్పించి భూమియందుఁ బాతించి పోతనను చెరసాలయం దుంచెను. కొంతకాల మిట్లు నడువ, సింగభూపాలునకు మహావ్యాధి యొకటి ప్రారంభమాయెను. ఒకనాఁడు కలలో భూపాలునిభార్యకు రామచంద్రుఁడు కనఁబడి, "పోతనను విడిపించి యాతని గ్రంథమును నతనికర్పించిన నీ మగని వ్యాధి కుదురు" నని చెప్పి యదృశ్యుఁడయ్యెను. ఆపలుకులు విని సింగభూపాలుఁ డానందించి పాతిన గ్రంథమును దెప్పించి పోతనను సభామధ్యమున గౌరవించెను. పోతనయు శిథిల గ్రంథమును జూచి కంట నీరుంచి కన్నుల కద్దుకొని భూపాలుని నాశీర్వదించి చనియెను. సభవారందఱును రాజును దూషించి,

ఉ॥ ఇమ్మనుజేశ్వరాధముల కిచ్చి పురంబులు వాహనంబులున్
సొమ్ములు గొన్ని పుచ్చుకొని సొక్కి శరీరమువాసి కాలుచే
సమ్మెటపోటులం బడక సమ్మతి శ్రీహరికిచ్చి చెప్పె నీ
బమ్మెర పోతరా జొకఁడు భాగవతంబు జగద్ధితంబుగన్.

అని పోతన మహిమను బొగడిరి.

## ౭. అమాత్యశేఖరుఁడు

రాజ్యాభివృద్ధికి రాజామాత్యులు ప్రధానము. సర్వకార్యనిర్వహణదక్షుఁ డగు నమాత్యశేఖరుఁ డుండిన, రాజు సామాన్యుఁ డయినను నభివృద్ధికిఁ గొఱత యేమియు నుండదు. ధీమంతుఁడును సమర్థుఁడును నయిన యమాత్యుఁడు లేని రాజ్యము చక్రమూడిన రథమువోలె మొదలంటఁ గూలును. రాజామాత్యు లిరువురును సమర్థులై యెల్లపుడానుకూల్యమున వర్తించినచో నారాజ్యము శోభించును. సువర్ణముతోఁగూడిన మణివలె వారిరువురు మెఱయుదురు.

ఇట్టి ప్రశంసనీయసమావేశ మాంధ్రదేశమునకుఁ గృష్ణరాయలకాలమున సంఘటించెను. కృష్ణరాయలు మహావిఖ్యాతి గాంచిన చక్రవర్తి. అతనికి సాటియగు మంత్రిశేఖరుఁడు తిమ్మరుసు. ఇతఁ డార్వేలనియోగి బ్రాహ్మణుఁడు. రాచిరాజను భూసురునకు జ్యేష్ఠపుత్రుఁడు. సాల్వవంశపురాజులయొద్దఁ దిమ్మరుసు పూర్వులు మంత్రులుగ నుండుచువచ్చిరి. దానివలన మంత్రి కులమునకు వారికిఁగూడ సాల్వవంశస్థు లని వ్యవహార మొనఁగూడెను.

తిమ్మరుసునకు గోవిందరాజను సోదరుఁడు గలఁడు. దురదృష్టవశమున బాల్యమునందే వీరి తలిదండ్రులు గతించిరి. మాతామహ గృహంబునకుఁ బోయి వీరు మాతులుని పోషణమునం దుండిరి. మేనత్త మున్నగువారు దయఁ జూపకున్నను గాలముఁ గడుపుకొనుచు, వీరు దరినున్న యరణ్య

మున తమ పశువులఁ మేపుకొని వచ్చుచుఁ గాలముఁ బుచ్చు చుండిరి. గోవిందరాజు కడు భక్తిశ్రద్ధలతో నన్నగారినే వెంట నంటి తిరుగుచుండెను.

ఒకనాఁడు తిమ్మరుసును, గోవిందరాజును నుదయము ననే భుజించి, పశువులను బూర్వపురీతినే యడవికిఁ దోలుకొని పోయిరి. కొంతకాలమున కొక యావు మందనుండి తప్పి పోయెను. దానిని వెదకుటకై సోదరు లిరువురును దిరిగి తిరిగి పట్టుకొని దానిని మందలోఁ గలిపిరి. గోవిందరాజు మందను బెదఱకుండఁ గాచుచుండెను. చాలదూరము తిరిగిన బడలికచేఁ దిమ్మరు సొక వృక్షచ్ఛాయఁ బరుండెను. సూర్యుఁ డపరాం బుధినిఁ గ్రుంకు సమయమయినది. అయినను దిమ్మరు సింకను నిద్రించుచునే యుండెను. ఆ సమయంబున నీ రెండ తిమ్మ రుసు ముఖంబునఁ బడుచుండెను. ఆ తరుకోటరంబునఁ గల యొక సర్ప మది చూచి పోయి తన విశాలమగు పడగనువిప్పి యెండ తగులకుండ నాతని ముఖమున కడ్డుపెట్టెను. ఈ దృశ్యము నంతయు దూరమున నొక వృక్షముక్రింద దపము చేయుచున్న యొకసిద్ధుఁడు విలోకించెను. భయాశ్చర్యసంభ్ర మంబులతో వెంటనే యచటికిఁ జని తిమ్మరుసును లేపి, “కుమారా! నీ వచిర కాలమునఁ బెద్ద సుయోగము ననుభ వించెదవు. ఎంతయో మహాయోగశాలికిఁ గాని పాముపడగ నీడక్రింద నిద్రించుట సంభవించదు. భద్రముగ నింటి కరుగు” మని చెప్పి వెడలిపోయెను.

అంత నన్నదమ్ము లిరువురును బశువులను దోలుకొని సాయంకాలమున కింటికిఁ జేరిరి. ఆనాఁటిరేయి నిద్రయందు

శ్రీరాముఁడు ప్రత్యక్షమై, 'నీవు మహామంత్రివి కాఁగల'వని చెప్పినట్లు తిమ్మరుసు కలగనెను. అంతటినుండియుఁ దిమ్మరుసు మనంబున నొక తుపాను రేగుచుండెను. విరుద్ధములగు నాలోచనము లుప్పతిలుచుండెను. సకలవిద్యలయం దారితేరిన మహామేధాశాలి యగు మంత్రిసత్తముఁ డెక్కఁడ? బలీయమయిన దుర్విధియోగంబునఁ గుందుచు నక్షరాభ్యాసమునకైనను వీలులేని విషమపరిస్థితుల నున్న తా నెక్కఁడ? యని నిరంతర మాతని మనస్సు కలఁత జెందుచుండెను. తుదకు మాతులుని యింట విద్యాభ్యాసమున కనువుగాదని ఎవ్వరికిఁ జెప్పక తిమ్మరుసు సోదరసహితుఁడై యెక్కడికో పయనమాయెను. వారు బళ్ళారి, కడప మున్నగు గ్రామంబుల కరిగి యందలి విద్యాధికులయొద్ద విద్యనందుచు మధుకరవృత్తిని జీవించుచుండిరి. తిమ్మరుసు కొలదికాలములోనే సర్వశాస్త్రంబుల నధిగమించి, పరభాషలఁ జాల నేర్చి, రాజనీతియందు నిపుణత నంది, సంగ్రామకౌశలం బలవఱచుకొని, యసాధారణమేధాశాలియై యిరువదవసంవత్సరమునకే యాంధ్రదేశమునఁ గీర్తి వహించెను. గోవిందరా జన్నకుఁ గొంత తక్కువయయ్యు నసిచాలనాశ్వారోహణధనుర్విద్యలయందు నేర్పుగడించెను.

ఆకాలమునఁ జంద్రగిరిరాజ్యమును సాలువనరసింహరాజు పరిపాలించుచుండెను. అతనియొద్ద వృద్ధుఁడును, రాజనీతివిశారదుఁడును నగు నాదెండ్ల చిట్టిగంగనామాత్యుఁ డను మంత్రివతంసుఁడు రాజకార్యముల నడపుచుండెను. ఈ మంత్రివరుఁడు తిమ్మరుసు ప్రసిద్ధిని గర్ణాకర్ణిగ విని వాని రావించి, 'కుమారా! నీవు ధీమంతుఁడవని లోకవినుతి నందితివి. నీ

పూర్వు లీ రాచవంగడమం దమాత్యులై పేరందియున్నారు. నేను వృద్ధుఁడనయితిని. నా యొద్ద కొన్ని దినంబులుండి రాజనీతిమర్మముల నెఱిఁగినచో ని న్నీ రాజ్యమున కమాత్యునిగాఁ జేసెద'నని తిమ్మరుసుతో బలికెను. తిమ్మరు సానందించి వాని యొద్ద లేఖకుఁడుగా నుండెను. గోవిందరాజును సోదరునకుఁ దోడునీడయై లేఖకక్రియల సహకారియై వర్తించుచుండెను.

విజయనగరసామ్రాజ్యమునకుఁ బ్రతినిధియై గుత్తి, పెనుగొండ, చంద్రగిరిదుర్గములను తుళువ నరసింహరాజు పాలించుచుండెను. గంగనామాత్యుని ప్రాపకమునఁ దిమ్మరుసు తుళువ నరసింహరాజునకుఁ బ్రధానామాత్యుఁడై, హిందూమతరక్షణార్థమై ప్రతిష్ఠాపితమైన యీ సామ్రాజ్యమును బరాధీనము గాకుండఁ గాపాడుచుండెను. అచ్చటనే గోవిందరాజు దండనాయకుఁడుగ నియమింపఁబడెను.

ఆలోపల విజయనగరసామ్రాజ్యమున కొక రాజకీయ విప్లవము సంప్రాప్తమయ్యెను. ఇమ్మడి విరూపాక్షరాయలు దుర్మార్గగామియు, భోగలాలసుఁడును, నవివేకియు నగుటం జేసి సామంతులు స్వతంత్రులైరి. వీని జ్యేష్ఠపుత్త్రుండు జనకునిఁ దునిమెను. వాని యనుజుం డన్నను సమయించి ఱేఁడయ్యెను. వీఁడును జలచిత్తుఁడై, లోకకంటకుఁడై, రాజకార్యవిదూరుఁడై, స్త్రీలోలత్వంబునఁ గాలముఁ బుచ్చుచుండెను. ఇట్టి సామ్రాజ్యవిప్లవమును దెలిసికొని తిమ్మరుసు గురుఁడగు గంగనామాత్యుని యుపదేశమును దలఁచి, రాజ్య మరాజకమైనకతంబున మహమ్మదీయుల పాలైనచో హైందవమత మడుగంటు నని యెంచి తుళువనరసింహరాజును విద్యానగరమును ముట్టడింపఁ

ప్రేరేపించెను. నరసరాజాకస్మికముగ గోవిందరాయని యాధిపత్యముక్రింద విద్యానగరరాజ్యము నాక్రమించెను. పిమ్మటఁ దిమ్మరుసు నరసింహరాజునకు పట్టాభిషేకముజేయించి, నిపుణతతో రాజకీయవ్యవహారముల నిర్వహించుచుఁ బ్రతిపక్షుల నందఱ నుక్కడంచి, విశేషశౌర్యప్రతాపంబుల సామ్రాజ్యమును మహోన్నతస్థితికిఁ దెచ్చెను.

నరసింహరాజు కొలదికాలమే రాజ్యమేలి, నిజపుత్త్రులగు నరసింహరాయ, కృష్ణదేవరాయ, యచ్యుతరాయ, రంగరాయలను దిమ్మరుసు నధీనము గావించి సామ్రాజ్యభారమంతయు నాతనిభుజస్కంధమున నిడి లోకాంతరగతుఁడయ్యెను.

జ్యేష్ఠుఁడగు వీరనరసింహరాయలను దిమ్మరుసు పట్టాభిషిక్తునిఁ గావించెను. సామంతులు స్వతంత్రులై తిరుగుబాటు చేయుటయుఁ, దురుష్కులు ప్రబలులై రాజ్యమును మ్రింగఁ జూచుటయుఁ గనిపెట్టి తిమ్మరుసు యోచించి తాను రాజ్యరక్షణముఁ జేయుచు, నరసింహరాయని దక్షిణదిగ్విజయమునకు, శ్రీకృష్ణదేవరాయనిఁ గర్ణాటకదేశవిజయమునకుఁ బంపెను. ఇరువురును శత్రువులను నిర్మూలించి విజయలక్ష్మీసమేతులై రాజధానిఁ జేరిరి. తిమ్మరుసు కృష్ణదేవరాయల విద్యాబుద్ధుల కలరి వానికి రాజనీతిఁగూడ గఱపుచు మిక్కుటముగఁ బ్రేమించుచుండెను.

నరసింహరాయ లాఱుసంవత్సరములు మాత్రమే పరిపాలనఁ జేసెను. మరణసమయమునఁ దనకుమారుఁ డెనిమిది సంవత్సరముల వయసువాఁడని కృష్ణదేవరాయనికే తిమ్మరుసు పట్టముఁ గట్టునని భయ మందెను. అందులకు దిమ్మరుసును

బిలిపించి, 'కృష్ణదేవరాయని రెండుకన్నులు తీయించి నాకుఁ జూపినఁగాని నేను మరణింపఁజాల'నని కఠినముగాఁ బల్కెను. తిమ్మరుసు మిగుల వగచి రాజశాసనమును కృష్ణరాయని కెఱింగించెను. అప్పుడు కృష్ణరాయలు, 'అప్పాజీ! నాయనగారు పోయినప్పటినుండియు మమ్ముల నతిజాగ్రత్తతో రక్షించుచు వచ్చితిరి. కావున వేఱొకశరణ్యము నాకులేదు; తమరే' యనఁ దిమ్మరుసు గుండెనీరయి, 'సుగుణఖనివగు నిన్ను రక్షించుట నాకుఁ గర్తవ్యము. కావున నా కన్నులనే యర్పించి రక్షించెద' నని పలికెను. దాని నాలకించి పిడుగుపడినట్లు చకితుఁడై సంభ్రమంబున, 'అప్పాజీ! అట్లయిన నేనిపుడే నా శిరమును ద్రుంచి వానికిఁ దృప్తిఁగావించెద' నని పలికి, మంత్రి ప్రయత్నములను మాన్పించెను. అట్టి విషమపరిస్థితులలో నేమి చేయుదునా యని యంతటి రాజనీతివిదుఁడును దటపట పడెను. ఆలోచించి, యాలోచించి కొంతవడికి ధైర్యముఁ జిక్కఁబట్టి కృష్ణరాయలను నిరపాయంబగు రహస్యస్థలంబున దాచి మేకకన్నులను తీయించి నరసింహరాయలకుఁ జూపి సంతృప్తిగావించెను.

రాజు మరణించెను. ప్రబలశత్రువులగు తురుష్కులు, కటక గజపతులు మున్నగువా రేక్షణ మనువగునా విజయ నగర రాజ్యమును గబళించుట కని ప్రక్కలో బల్లెమువలె నుండ, వారియనుమతినిఁ దిమ్మరుసు గృష్ణరాయలను బట్టాభిషిక్తుఁజేసి దానె రాజ్య వ్యవహారములను నిర్వహించుచుండెను.

తిమ్మరుసు సహాయముననే కృష్ణరాయలు నానాదేశంబుల జయించి, యాంధ్రలక్ష్మీజయపతాకల నాంధ్రదేశమందెల్లెడల స్థాపించెను. రాయచూరు, కొండవీడు మొదలగు నభేద్యంబులగు దుర్గముల నాక్రమించి జయోత్సాహము పురికొల్ప నావేడిమిచే గజపతుల యధీనమందున్న కటకమును జయింపఁ దాడినడుపుమన, తిమ్మరుసు 'ధీసత్తమా! మనసేనలన్నిటి కాదేశింపుఁడు. అప్పుడు అలసియున్నవి. ఇప్పుడువిశ్రాంతిని మిక్కుటముగఁ గోరుచున్నవి. కటకదేశము గజపతి యాయువుపట్టు. భద్రముగ పాత్ర సామంతులచే సురక్షితమయినది. కావున నిప్పుడు మన రాజ్యమున కరిగి సేనల నాయితముఁజేసికొనుట యుక్తమగు' నని పలికెను. దానికి రాయలు, 'నీవుపోయి మన మూలబలమును సహాయము గొని రమ్ము. పొ'మ్మని చెప్పి వెంటనే కటకమునకు దాడివెడలెను. అచ్చట రాయలసైన్యము డస్సియుండుటచే నోటువడినది. రాజు చేయునదిలేక తిమ్మరుసు నాలోచన యడిగెను. రాజనీతి విశారదుండగు తిమ్మరుసు నిగూఢప్రయోగముఁజేసి యా కార్యము సాధించెను. పరిసరంబులం దంతటను గజపతిచారు లుండుట గ్రహించెను. అది నిజమే. పాత్రసామంతులకును, కృష్ణరాయలకు నేవిధమగు సంధివ్యాపారము జరుగకుండ గజపతి యట్లు సన్నాహము గావించెను. దీని నాధారముచేసికొనియే గజపతిని సంధికి రప్పించెను. పా తసామంతులసంఖ్యకనుగుణముగఁ బదునాలు సువర్ణ పేటికలఁ జేయించి యందు బంగారురేకులపై సందేశము ,ాసి భద్రముగా ముద్రవేసి తనచారులచేఁ బాత్రసామంతు ఁబంపెను. గజపతి

నియమితులైన గూఢచారులచేఁ దిమ్మరుసు వేగులవాండ్రు పట్టుబడిరి. ఆ సువర్ణపేటికలన్నియు గజపతి చెంతకుఁ గొంపోయిరి. వానితీసి సువర్ణపత్రములనున్న జాబును జదివింప నన్నిఁటియందును నొకరీతిగనే యున్నది. దానివలన పాత్ర సామంతు లందఱు రాయలతో సంధిగావించుకొని తన్ను వంచింపనున్నారని గ్రహించి, వెంటనే రాయలతోడి సంధి కియ్యకొనెను. గోదావరీ కృష్ణానదుల మధ్యనున్న ప్రదేశ మంతయునుఁ దాను గ్రహించి సంధిగావించుకొని రాయ లింటికి వచ్చెను.

ఇట్లు రాయల దిగ్విజయయాత్ర లన్నింటిలోను పెక్కు విధములఁదననీతిశాస్త్రమును బ్రయోగించి తిమ్మరుసుసహాయ పడెను. ఇతఁడు రాజ్యాంగవిషయములందేగాక గ్రంథరచనము నందు ననన్యసామాన్యకౌశలము వహించెను. ఇతఁడు సంస్కృత భారతమునకు వ్యాఖ్యానము రచించి లోకవిఖ్యాతి నందెను.

స్వార్థత్యాగియై సనాతనధర్మరక్షణార్థమై తన జీవితమును వినియోగించిన తిమ్మరుసు 'అమాత్యశేఖర' బిరుదమునకుఁ దగియున్నాఁడు.

## ౮. సేవకాధికుఁడు

ఉ॥ ఎండకు వాన కోర్చి తనయిల్లు ప్రవాహపుఁజోటు నాక యా
కొండు నలంగుడు న్నిదురకు న్దఱి దప్పెడు డప్పిపుట్టె నొ
క్కండన యెట్లొకో యనక కార్యముముట్టినచోట నేలి నా
తం డొకచాయఁ జూపినను దత్పరతన్ బనిచేయు టొప్పగున్.

సేవకావృత్తి మానవమాత్రునకుఁ దప్పనిది. పుట్టిన వానికిఁ జావెట్లో, యటులనే మరణించువరకును సేవకావృత్తి యనివార్యము. జీవరాసులయందెల్ల మానవుఁడే మిక్కిలి యస్వతంత్రుఁడు. ఎదిరిమానవుని సహాయ మపేక్షించును. తన కార్యముల నెరవేర్చుకొనుటకై యితరులను గొలువవలెను. ఇట్లు సేవకావృత్తి యేర్పడుచున్నది. మన జీవితపథమునకు ముఖ్యాలంబనమగు నిది కొందఱనుకొనున ట్లెన్నటికిని నీచము కాదు. ఈ సేవకావృత్తి భౌతికవిషయములందేగాదు; దివ్య విషయములందును గావలెను. భగవంతుని తత్త్వరూపమును దెలిసికొనుటకు జీవాత్మకుఁ బరమాత్మకుఁ సేవ్యసేవకభావమే యవసరము. స్వార్థచింత లేక సేవ్యుని సేవించిన వానికి నైహికమునఁ గాని యాముష్మికమునఁ గాని సిద్ధింపని యర్థ మేమున్నది ? భగవత్సేవకులలో నగ్రగణ్యులే భక్తులనంబడుదురు. ఇందులకు హనుమంతుని జీవితచరిత్ర తార్కాణమగుచున్నది.

తొల్లి నయోధ్యను రాజధానిగఁ జేసికొని, సూర్యవంశజులు నిక్ష్వాకుకుల ప్రధానులు వింధ్యాద్రికుత్తరమును బాలించుచుండిరి. అందులో దశరథమహారాజు కోసలదేశమును బాలించు

సమయమున దక్షిణహిందూదేశమునఁ గొండలు వనచరులు
నివసించుచుండిరి. వీరు సత్యపరులు, సుగుణనిధులు, సేనానిపు
ణులు. వారిలో దక్షిణారణ్యమునఁ గుంజరుఁడను వనచరుఁడు
గలఁడు. వానికి రూపవతియు, గుణవతియు నగు నంజనయను
కుమార్తె గలదు. కాలక్రమమున యౌవనవతియయిన తన
కుమార్తెను గేసరియనువాని కిచ్చి యుక్తవిధిని వివాహము
గావించెను. ఆ దంపతులు భగవద్భక్తిని కాలముగడపుచు
నన్యోన్యప్రేమతో నుండిరి. ఇక వారికి సంతానమొక్కటియే
లోటుగనుండెను. అంజన మిక్కిలి శ్రద్ధాభక్తులతో వాయు
దేవునిగూర్చి తీవ్రముగఁ దపముఁజేసెను. ఆమె తపమునకు
మెచ్చి ప్రత్యక్షమయి తనయందుఁగల శివధామము నొసంగ,
నామె గర్భవతియై సకాలమునఁ దేజోనిధియగు నొక కుమా
రునిఁ గనెను.

ఒకనాఁ డరుణోదయముననే తనకుమారుని నింట విడిచి
పండ్లకై యామె యడవికిఁ బోయెను. అరుణబింబము తూర్పు
దెసఁ గనుపట్టుచుండెను. ఆనాఁడు సూర్యగ్రహణ దివస
మగుటం జేసి ప్రజలు, మునులు, దేవతలు, గ్రహణము బట్టఁ
బోవుచున్నదని యాతురతతోఁ జూచుచుండిరి. అంజనా
సుతుండు శోణారుణబింబమును ఫలమని యెంచి బింబముపై
కెగిరెను. గ్రహణోన్ముఖుండయిన రాహువు వెఱచి వెనుకకుఁ
బాఱిపోయి, తన కెట్టి కీడు వాటిల్లునో యని రక్షణార్థమై
దేవేంద్రునియొద్దకరిగి మొఱలిడెను. వాయుపుత్రుఁడు సూర్యుని
వేడిమి కాగలేక కమిలి నేలపైఁ బడెను. గ్రహణము జరుగ
లేదుగావున ఋషులు దేవతలును గర్మకలాపమునకు లోపము

వాటిల్లెననియు జ్యోతిశ్శాస్త్రమున కప్రామాణ్యము కలిగె
ననియు దేవేంద్రునకు విన్నవించిరి. ఇంద్రుఁ డుగ్రుఁడై యలుకఁ
బూని సూర్యునిబట్ట నెగిరినబాలుని ద్రుంచెదనని వజ్రాయుధ
మును గైకొని బయలుదేఱెను. ఆంజనేయుఁడు వజ్రమునెత్తి
వచ్చుచున్న యింద్రునిఁ గని సితప్రభాజాలంబుల మెఱయు
చున్న యింద్రుని యాయుధంబుఁ గని 'పూర్వ మెఱ్ఱని పండు
వేడిగానున్నది. ఇది తెల్లగనున్నది. నా కనుకూలింపవచ్చు'
నని భావించి వానిపై కురికెను. ఇంద్రుఁడు జడిసి పాఱి
పోవుచుఁ దనచేతనున్న వజ్రాయుధమును విసరెను. ఆ దెబ్బకు
వాయుపుత్త్రుఁడు నేలపైఁబడి మూర్ఛిల్లెను. వాయుదేవుఁ డా
వార్తవిని వడివడి వచ్చి బాలునెత్తుకొని యుదయపర్వతకంద
రములోనికిఁ గొంపోయి యచ్చట దానును దాగియుండెను.

దాన ప్రపంచమునకెల్ల యొక మహావిప్లవము సంభ
వించెను. ఎచ్చటను వాయుప్రసారములేదు. అగ్ని ప్రజ్వరిల్లుట
లేదు. హోమక్రియ లాగిపోయెను. సూర్యునిగతి భంగపడెను.
క్రియాకలాపము లడ్డుపడెను. భగవంతుని స్తోత్రము చేయుట
కైనను నేరికి నోటమాటరాకుండెను. దివారాత్రములు లేవు.
దేవపితృగణంబులకు హవ్యకవ్యాదులు లేవు. బ్రహ్మదేవున
కీ సంగతిఁ దెలుపువారే లేరు. అజున కేమియుఁ గారణము
గోచరించుటలేదు. తన వాహనమయిన హంస కదలుటలేదు.
అంత నతఁడు తనదివ్యదృష్టినిఁజూచి కారణమరసి నూతనశక్తిని
గల్పించుకొని వాయుదేవుని సమీపమునకరిగెను. వాయుదేవుఁ
డెదురేగి బ్రహ్మదేవుని కెఱఁగి స్తుతిసల్పి తన యుపసంహార
కారణమును నివేదించుటకై మృతప్రాయుఁడై మూర్ఛఁబడి

యున్న బాలు నాయన పాదములపైఁ బడవేసెను. పరమేష్ఠి వాని నూరడించి, బాలుని మూర్ఛదేర్చి, 'దేవతలకును నజేయుఁడవై యమితసత్వసంపదల దేవహితంబులు సేయుచుందువు గాక' యని దీవించి, లోకోపద్రవమును బాపుమని వాయువుతోఁ జెప్పెను. ఈ విషయ మెఱిఁగి యింద్రాది దేవతలును, మునులును వానియొద్దకు వచ్చిరి. బ్రహ్మ వారలఁజూచి యీ బాలునిహనువు వజ్రాయుధమునవికృతమైనదిగావునవీఁడు హనుమంతుఁ డనుపేరఁ బరగును. దేవహితార్థ మీతఁడు రాక్షస సంహారముఁ జేయఁగలఁడు. కావున మీ రీతని దీవింపుఁడని చెప్పెను. బ్రహ్మ తనయస్త్రంబు వాని నేడుఘడియలకాలమే బంధింపఁగలదని నుడివెను. తనవజ్రాయుధము వానికి హానిఁ జేయనేరదని దేవేంద్రుఁడును, దన యస్త్రశూలములచే వానికి హాని కలుగదని శివుఁడును, వానినిఁ జంపనని యముఁడును బ్రసాదించి 'బలపరాక్రమముల విలసిల్లుత' యని వాని దీవించిరి. ఈ లోపున నంజనాదేవి యింటఁ బాలునిఁ గానక విహ్వల చిత్తమై దురపిల్లుచుండెను. అది తెలిసి వాయువు పుత్త్రుని నామెయొద్దనుంచి పోయెను.

శుక్లపక్ష క్షపాకరునివలె దినదినప్రవర్ధమానుఁడై హనుమంతుఁడు వెలయుచుండెను. బాల్య చాపల్యమునకు బ్రహ్మాదుల వరములు వానరప్రకృతికిఁ దోడుగాఁ నక్కడి ఋషుల నల్లరిపెట్టుచుండెను. దానికి జడదారులు కోపించి 'నీ పరాక్రమము నీ వెఱుంగకుందువుగాక' యని శపించిరి. దీని నెఱిఁగి బ్రహ్మర్షులకడ కరిగి వారిని మందలించి హనుమంతున కిచ్చిన శాపమును మరల్పుఁడని చెప్పెను. సంయ

మీంద్రు లందుల కంగీకరించి, స్మృతికి వచ్చు'నని శాపమును ద్రిప్పిరి.

తరువాత హనుమంతుఁడు సూర్యునొద్దకుఁబోయి విద్య నేర్పుమని కోరెను. నిత్యము సూర్యుఁడు ప్రయాణము చేయుచుండుటచే హనుమంతుఁడు తన యాకారమును బెంచి యస్తోదయాద్రులఁ దన రెండుపాదముల నుంచి సూర్యునియొద్ద సమస్త రహస్యముల నేర్చెను.

దశరథమహారాజు కొమరులలో నగ్రజుఁడయిన శ్రీరామచంద్రుఁడు పితృవాక్యపరిపాలనకై సీతాలక్ష్మణసమేతుఁడై రాజ్యభ్రష్టుఁడై యడవులఁ బదునాలుగేండ్లు వాసముఁ జేయవలసివచ్చెను. పంచవటీతీరంబున, బర్ణశాల నిర్మించుకొని యరణ్యవాసముఁ జేయుచుండ పౌలస్త్యుఁ డగు రావణాసురుఁడు సీత నెత్తుకొనిపోయెను. సీతాన్వేషణమునకై రామలక్ష్మణు లిరువురుఁ దిరుగుచు పంపాసరోవరతీరంబునకు వచ్చిరి. అప్పుడు పరిసరములఁ దిరుగుచున్న వీరినిఁ జూచి మతంగపర్వతముననున్న సుగ్రీవుఁడు వీరిని॥ దనయన్నయగు వాలి యంపిన వీరు లేమో యని శంకించెను. వీరివృత్తాంత మరయుటకుఁ దన ముఖ్యసేవకుఁడగు హనుమంతుని బంపెను. అంజనాసుతుం డట్లుజని విదితవృత్తాంతుఁడై వారినిఁ దనప్రభువునొద్దకురావించి పరస్పరమైత్త్రిఁ గావించెను. రాముఁడు చేసిన వాగ్దానమురీతిని యుద్ధమున వాలిని సంహరించి సుగ్రీవుని కిష్కింధాధిపతిగఁ జేసెను. అనంతరము సుగ్రీవుఁడు రాముని భార్యను వెదకుటకై వానరుల నన్నిదిక్కులకుఁ బంపెను. అందు దక్షిణమునకరుగు వారిలో హనుమంతునిచేఁ దన యంగుళీయకము సీత కొన

నాలుగఁ బంపెను. వానరసేనయంతయు బయలుదేఱి దక్షిణ సముద్రమును జేరెను. అచ్చట సంపాతి వీరినిఁజూచి చేరఁజని విషాదాంకితవదనముల గుర్తించెను. దాని కారణము తెలిసికొని సీత రావణునిచే హరింపఁబడి సముద్రమున కవ్వలనున్న యశోకవనమం దున్నదని చెప్పెను. అప్పుడు వానరులకు విషమపరిస్థితి సంప్రాప్తించెను. శతయోజన విస్తీర్ణంబయిన సముద్రమును దాటు టెట్లో వారికిఁ దెలియకుండెను. వృద్ధుఁడగు జాంబవంతుఁడు బొగడ హనుమంతుడు సముద్రలంఘనమునకుఁ బూని, యెన్నివిఘ్నములు వచ్చినను వానినన్నిఁటి లంఘించి సాగర మంబరమార్గమున దాటి లంకయందుఁ బ్రవేశించి, యంతయు వెదకి తుద కశోకవనమున రాక్షసస్త్రీపరివృత యయి 'రామ రామ' యని విలపించుచున్న స్త్రీనిఁ గని సీత యని భావించుకొనెను. తరువాత సమయముఁజూచి యామెకు రాముని యానవాలిచ్చి, ధైర్యముఁజెప్పి, రామలక్ష్మణులను వేగముగఁ దెచ్చెదనని చెప్పి వెడలుట కామె సెలవుతీసికొనెను.

తాను వచ్చినకార్యమును రాక్షసరాజున కెఱుకపఱుప వలెనని తలఁచియా వనమంతయు విధ్వంసముగావించుచుండెను. రాక్షసు లెందఱువచ్చినను బిడికిటిపోటుల, వాలప్రహారంబులఁ జెండాడి ప్రచండపరాక్రమంబున దుర్నిరీక్ష్యుండై యుండె. చివరకు నింద్రజిత్తు హనుమంతుని బ్రహ్మాస్త్రంబుచేఁ గట్టి, తండ్రిమ్రోల నుంచెను. నిర్భయంబుగఁ దావచ్చిన దూత కార్యంబును రావణున కెఱిఁగించెను. వాని స్వేచ్ఛాలాపములకు రావణుఁడు మిగుల గోపించి హనుమంతుని శిరమును ఖండింపు మని యాజ్ఞాపించెను. సత్వగుణసంపన్నుఁడును,

సదయహృదయుఁడును, రావణుని సోదరుఁడును నగు విభీషణుఁడు దూత యవధ్యుఁడని బోధించి వేఱొకశిక్ష విధింపుమని ప్రార్థించెను. దాని విని కోతులకు వాలంబులు ప్రియంబులని హనుమంతుని వాలంబునకు నూనెతోనున్న గుడ్డలుచుట్టి నిప్పంటించిరి. ఆ మంటతోడనే లంకలోని గృహంబు లన్నియును దగ్ధము లయ్యెను. ఇట్లు లంకాదహన మొనరించి మరల సముద్రమును దాటి తోడివానరవీరులతోఁ గలిసి సుగ్రీవాదులసన్నిధికిం జని సీతను జూచితినని యావద్వృత్తాంతమును రామలక్ష్మణులకు నివేదించెను. శ్రీరాముఁడు గొప్ప వానరసేనను గూర్చికొని వారి సహాయంబున సేతువుఁగట్టి వారధిదాటి లంకపైకి దాడివెడలెను. యుద్ధమునందు వానర సైన్య మంతయు నింద్రజిత్తు మాయాబలంబున మూర్ఛపడి యుండ వారినిఁదేర్చ ద్రోణాద్రియందున్న సంజీవియనుమూలిక కావలసివచ్చెను. సేవకాగ్రేసరుఁ డయిన హనుమంతుఁ డుత్సాహముతో బయలుదేరి దారిలో రాక్షసమాయ లన్నిఁటిని దాటి యస్తాద్రి కరుణుఁడరుదేరకమున్నే సంజీవిపర్వతమంతయుఁ బెకలించి మోసికొనవచ్చెను. కార్యానంతరమున మఱల నా పర్వతమును యథాస్థానమును జేర్చెను. అనేక రాక్షసులను ద్రిపుర ధూమ్రాక్ష దేవాంతకాది సేనాపతులను సమయించి రామున కెక్కువగఁ దోడుపడెను.

మఱియు రావణుఁడు ప్రయోగించిన శక్తివలన లక్ష్మణుఁడు మూర్ఛఁజెందెను. భ్రాతృవియోగమునకు రాముఁడు మిగుల వగవఁజొచ్చెను. అప్పుడు హనుమంతుఁడు రెండవసారి ద్రోణాద్రికిఁబోయి సంజీవినిఁదెచ్చి బ్రతికించెను. యుద్ధానంతర

మున సీతాసహితుఁడై మిగిలిన యనుజీవివర్గముతోఁ బుష్పక మున నయోధ్యకు బయలుదేరెను. నందిగ్రామమున నున్న భరతునకు రాముని యాగమనవృత్తాంతము నెఱుకపఱచినది హనుమంతుఁడే. పట్టాభిషేకసమయంబున రామపాదార విందంబులను ధ్యానించుచు బంటుకైవడి సీతారాముల ప్రోల వినమ్రుఁడై యాసీనుఁడయ్యెను.

ఇట్లు సేవకాగ్రగణ్యుఁడై శ్రీరామకరుణాకటాక్ష పాత్రుఁడైన హనుమంతుఁడు చిరంజీవియై యశోవిరాజితుఁ డాయెను.

నమ్మి సేవించినవారికి ఇష్టప్రాప్తి కలుగును గదా!

# ౯. దైవభక్తుఁడు

క॥ చిక్కఁడు వ్రతముల క్రతువులఁ
జిక్కఁడు దానముల శౌచశీలతపములం
జిక్కఁడు యుక్తిని భక్తినిఁ
జిక్కినక్రియ నచ్యుతుండు సిద్ధము సుండీ.

మానవునిజీవితమును సార్థక్యతకుఁ దెచ్చి ముక్తిఫలమును జేకూర్చునది భక్తియే. జీవకోటులందు భగవంతుని సేవించుట కనువగు సాధనసంపత్తి గలిగి యితరజీవరాసులకంటె నధికముగ వివేకవిజ్ఞానముల రెంటిచేత మానవుఁడు వెలయుచున్నాఁడు. భక్తులకుఁ గష్టపరంపరలు గలుగుననుట సత్యము. అగ్నిపుటంబునగాని బంగారము శుభ్రముకానట్లు కష్టపరంపరలఁగాని భక్తితత్పరత గుదురదు. భగవంతునియందు దృష్టి నిరంతర ముండుటయు, బాహ్యవిషయముల సంగమేమియు లేకుండుటయు భక్తికిఁ బ్రధానములు. తనశక్తియందహంకారముపోయి భగవంతుని శక్తియే యన్నింటికిఁ గారణమని తెలిసినఁగాని నిరూఢమైన భక్తిగాదు. తన తాలిమిని దెలియఁజేయుటకై కష్టపరంపర లవశ్యములు. మనుజుఁ డగు వానికెల్ల సుఖమే కావలయునుగాని కష్టము దుర్భరము. అందువలన వాని నివారించుకొనవలెనని జీవిసామాన్యమునకుఁ గోరిక యుండును. మానవుఁ డందులకుఁ బ్రయత్నించి తనసామర్థ్యమున నీశ్వరశక్తినిఁ దెలియఁగలఁడు. ఇందులకే భక్తులకుఁ గష్టములు మెండు. భగవంతునిఁ బ్రేమింపని మానవుఁడు ద్విపాద

పశు వనఁదగును. మనదేశమున నెన్నియోభక్తులచరిత్రలు మన కాదర్శములై మనలకు దైవభక్తి నుద్బోధించుచున్నవి. బాలభక్తులగు ప్రహ్లాద, ధ్రువాది మహనీయులట్లును, రామదాసు, చైతన్యాది ఘనులమాడ్కిని, వృద్ధులయిన నారదాంబరీషాదుల ఫక్కిని భక్తావతంసులై లోకవినుతినంది పరంధామమును గరతలామలకంబు గావించుకొనినవారి జీవితమే జీవితము. దైవభక్తుఁడయి యార్యదేశమున భక్తులనోట నేఁటికిని మ్రోగుచున్న భక్తుల నామములలో నొకటిగదా తుకారాముని నామము. వీని చరిత్రము మనము తెలిసికొందము.

మహారాష్ట్రదేశమున మోరేయను నుపాధిగల ప్రాచీన మహారాష్ట్రకుటుంబమున జనించి సద్గుణసంపన్నుఁడై, శాంతిస్వభావుఁడై, నిరతాన్నప్రదాతయై, సన్మార్గగామియగు మోట్లోలా యను మహారాష్ట్రయువకుఁడు గలఁడు. సచ్చరితయు, భక్తురాలును నయిన కనకాబాయి యను నొక నారీరత్నము వానికి భార్యయై, పతిభక్తిపరాయణలలో మిన్నయై వెలయుచుండెను. చిరకాలమువఱకు నా దంపతులకు సంతానములేదు. భగవదనుగ్రహమున వయసుమీఱినవెనుక వారికి షాజి, తుకారాము లను నిఱువురుపుత్త్రు లుదయించిరి. బాలుర బాలలీలల వినోదించుచు నా దంపతులు ధనధాన్యసమృద్ధులై సుఖముగాఁ గాలముబుచ్చుచుండిరి.

షాజీ సంసారసుఖములం దనురాగములేక విరాగియై తన తలితండ్రుల వీడి యెటకో చనియెను. తుకారాము వృద్ధులయిన తలిదండ్రులను సాకుచు సంసారమును గడపవలసినవాఁ

డాయెను. మోట్లోలాసంసారము ధనవంతమై గౌరవమర్యా దలు కలిగి యొప్పుచుండెను. తుకారామునకుఁ బదునేఁడవ వత్సరమున నే యతని తలితండ్రులు స్వర్గస్థులయిరి. తుకారాము ప్రథమభార్యయగు రుక్మాబాయి కాసరోగపీడితయగుటవలన నింకొక యువతినిఁ బెండ్లిచేసికొనెను. ఈమె పేరు జిజీబాయి. ఈమె యొక యున్నతకుటుంబమునకుఁ జెందిన నారీరత్నము. పతిభక్తిపరాయణురాలు. సంసారనిర్వాహణదీక్షగల యువతీ మణి. వీరిరువురును సుఖముగఁ గాలము గడుపుచుండిరి. యజ మానుఁడు పొందికలేనివాఁడయిన నిల్లు బాగుపడుటెట్లు? కాలక్రమమున నాకుటుంబమునకు హీనదశవచ్చెను. తుకారాం సత్త్వగుణప్రధానుఁడై, భగవద్భక్తుఁడై యుండుటఁజేసి భజనలు జేయుట, భగవత్కార్యములఁ బాల్గొనుట మున్నగుసత్కార్య ములనే చేయుచుండెను. తన పైతృకంబగు ధనమంతయు దానధర్మముల వ్యయపఱచెను. ఇక చేయునదిలేక తనకులవృత్తి యగు వర్తకము నవలంబించెను. ఇక్కడను సత్త్వగుణాను వర్తనమున నతఁడు కష్టములకు లోఁబడెను. అసత్యమును బరి హరింప వలయునని, ధర్మముచే నతఁడు లాభమేమియుఁ దీసి కొనక కొనిన ధరలకే సరకు లమ్ముచుండెను. ఇంతకంటె ప్రాపంచికదృష్టియందుఁ జ్చిపని యున్నదా? బీదలకు ధర్మ ములఁజేసి సరకులనమ్మి ధనమును రాఁబట్టజాలక చాలమందికి బాకీపడి యాతఁడు కష్టముల పాలాయెను.

కాని యిన్నికష్టములు వచ్చినను బాటింపక యాధ్యా త్మికదృష్టికలవాఁ డగుటచే నవియన్నియు సోపానమార్గము లని యెంచి, బాల్యమాదిగఁ దన కిష్టదైవతమైన విఠోబాను

భజించుచుండెను. సంసారమునుగడపుట యతని కెక్కుడు కష్టముగ నుండెను. కొంతపడికి ధాన్యము నెద్దులమీఁద వైచికొనిపోయి యమ్ముట కారంభించెను. ఇక్కడను దయాపరుఁడగుటచే నష్టమును బొందెను. ఇంటికిఁజేరుసరికతని యెద్దులు మరణించెను. ఇంటియొద్ద బందుగులు, మిత్రులు వానిని దూషించి, విష్ణుభక్తులసంసారము లున్నతికి రా వనసాగిరి. తుకారామున కవియెల్ల నవ్వులాటగఁ దోచెను. ఇన్ని యిక్కట్టుల పాలయినను విఠోబానామస్మరణము జేయుచు నాహారమున్నను, లేకున్నను నొకేవిధముగా భక్తిపరాయత్త మానసుఁడై కాలము బుచ్చుచుండెను. జిజీబాయి పుట్టినింటి వారు ధనికులగుటచే నామె కొంతద్రవ్యమును దెచ్చి భర్త కొసంగి వ్యాపారమును గడుజాగ్రత్తగాఁజేసి సంసారము నడుపుమని వేడెను.

తుకారాము తోడివర్తకులతో బయలుదేఱి వ్యాపారము చేయుచుండెను. ఆ వ్యాపారమున స్వల్పముగ లాభము వచ్చియుండెను. తిరిగివచ్చుచుఁ దుకారా మొకబ్రాహ్మణుని రాజభటులు బాధించుట గనెను. బ్రాహ్మణునివలన వానిబాధకుఁ గారణము ఋణమని తెలిసికొని, తన వ్యాపారమున వచ్చిన కొలదిలాభమును ఆబ్రాహ్మణుని ఋణనివృత్తికై యిచ్చెను. యథాప్రకారముగఁదుకారామింటికిఁజేరునప్పటికి చిరపరిచితములయిన దూషణవాక్యములే స్వాగత మిచ్చెను. నానాఁటికిఁ దుకారాము హృదయమున విఠోబాయందలి భక్తి పెంపొందుచుండెను.

దేహూగ్రామమున కనతిదూరమునఁ బండరిపురము గలదు. ఇది వైష్ణవపుణ్యక్షేత్రములలో నుత్తమమై, యసంఖ్యాకంబులగు ప్రజలకు యాత్రాస్థానమై వెలయుచుండెను. తుకారాము ప్రతి యేకాదశినాఁడును దూరమని తలంపక తన దేహూగ్రామమునుండి పండరిపురమునకు వెడలి విఠోబాదేవుని దర్శించి, యచ్చటి యుత్సవముల భక్తిపారవశ్యంబున మైమఱచి భజనలఁగావించి, మఱునాఁ డిల్లుచేరెడివాఁడు. అట్లు పదునాలు గేకాదశు లతినిష్ఠమై పండరినాథుని సేవింప విఠోబాస్వామి యా భక్తునికి స్వప్నమునఁ బ్రత్యక్షమై దేహూగ్రామసమీపమునఁ గల మామిడితోటలో విఠోబా విగ్రహము గలదనియు, దాని నారాధింపుమనియుఁ జెప్పి యదృశ్యుఁడాయెను. ప్రభాతమున లేచి తుకారా మాతోఁటలోని కరిగి చూచుసరికి స్వప్నవృత్తాంతము నిజమై యొకరసాల వృక్షముక్రిందఁబడియున్న విఠోబావిగ్రహమును జూచి యానందించి పలువుర ధనసహాయమున నట నొకయాలయము నిర్మించెను. అచట పరమభక్తిని నావిష్ణువిగ్రహంబును బూజించుచుండెను. తుకారాము మహాభక్తుఁడని లోకమునందెల్ల వెల్లడియాయెను. బ్రాహ్మణేతరుఁడగు తుకారామునకుగురూపదేశము లేకయే యిట్టిభక్తి యబ్బినదనికొందఱు బ్రాహ్మణు లసూయాగ్రస్తులై వానిని వంచింపఁ జూచుచుండిరి. తుకారాము బండరినాథునే సద్గురువుగా భావించి భక్తిజ్ఞానము లందియుండెను. కాని లోకులాడు మాటల విని మనసునఁ జింతించుచుండ, నాఁటిరేయి స్వప్నమునఁ బండరినాథుఁడు వృద్ధబ్రాహ్మణవేషము ధరించి తుకారామునకుఁ గనఁబడి “హా రే రామ హా రే

రామ రామ రామ హరే హరే” యనువాక్యము నుపదేశించి పోయెను. అంతటినుండియు గురూపదేశము కాలేదను చింత యాతని మనంబునుండి తొలంగిపోయెను. భగవదుపదేశ మయిన నాఁటినుండియు సంశయము లన్నియుఁ బాసి ప్రపంచా తీత తేజమునఁ గన్నులు తెఱచి, యానందించుచు ఆతఁ డధిక ముగ భగవంతునిఁ గొలువసాగెను; తరంగములఁబాడుచు, నున్మత్తుని భంగి నృత్యములుచేయుచు నాలయంబున దివా రాత్రంబులు గడుపుచుండెను. బ్రాహ్మణులు, బ్రాహ్మణేతరు లును తుకారామునకు శిష్యులయి జ్ఞానోపదేశముఁ బొందు చుండిరి.

తుకారాము నిర్మించిన యాలయము నంటియే యొక మఠము గలదు. దానికి మాస్వాజీబాబా యను సాధు వధిపతి. అతఁడు తుకారాము ప్రసిద్ధిని విని సహింపలేక దుర్భరంబగు నసూయాభరంబున డిందుపడియుండెను. ఒకనాఁడు తుకా రాము ధేనువు మఠమును బ్రవేసించినది. మాస్వాజీ హృద యంబున దాని గనినవెంటనే యసూయానలంబు ప్రజ్వరిల్లెను. దినదినంబును నా ధేను వట్లే మఠమును బ్రవేశించుచుండెను. అంతకంతకు వృద్ధియగు నీసుపెల్లున మఠము ప్రాకారముపైన ముండ్లమండలను వేయించి చుట్టును బాతించెను. ముండ్లు దేవాలయావరణలోఁ బడుటఁ జూచి తుకారాము భక్తు లకు బాధకలుగకుండ వానిని దీసి శుభ్రపఱచుచుండెను. ఈ సంగతిఁ దెలిసికొని మాస్వాజీ యొకనాఁడు తుకారామునుఁ దనకోపముతీఱ ముండ్లమండతో మోదెను. భక్తుఁడగు తుకారాము ఏమియు మాటాడక తన బాధను విఠోబా

స్వామికిఁ దరంగములతో మొఱపెట్టుకొనెను. భక్తులమొఱ లాలించి వారి నుద్ధరించుటయే భగవంతుని ధర్మము. వెంటనే మాస్వాజీ శరీరమున నొక విధమగు కంపము కల్గెను. బాధ దుర్భరమాయెను. భక్తుని బాధించినందులకుఁ దగిన ప్రాయశ్చిత్త మయినదని తెలిసికొని తుకారాము శరణువేడెను. తుకారాము ప్రసన్నుఁడు కాగానే యాతని మంటలు చల్లారెను. అది మొదలు సాధువుగూడ తుకారాము శిష్యులలో నొకఁడై జ్ఞానోపదేశము నందెను.

భర్తృ మహిమాతిశయంబును విని తుకారాముభార్య జిజీబాయి వైహికవాంఛల వీడి భర్తవలన నుపదేశమంది యా యాలయమందే యుండి నిరంతరము విఠోబాస్వామిని ధ్యానించుచుండెను. ఆ పుణ్యదంపతులకు నొక పుత్త్రుఁడు, పుత్త్రికయుఁ గలరు. వారివంశ మిప్పటికిని వృద్ధిలోనున్నది.

తుకారాము సనాతనధర్మవిరుద్ధముగ జాతిభేదము లేక శూద్రులనక, పంచములనక, ద్విజులనక శాస్త్రమర్మములను నిశ్శంకగాఁ దెలుపుచుండెను. కొందఱు బ్రాహ్మణులు దీనికి మిక్కిలి చింతింపసాగిరి. అధికారములేనివారికి శాస్త్రరహస్యముల నెఱింగించుచున్నాఁడని కోపించి వాని యభంగములు గల గ్రంథమును లాగికొని నింద్రాణీనదియందుఁ బార వైచిరి. పుత్త్రునికోల్పోయినయట్లు దోదూయమాన మానసుఁడై తన విషాదమును భగవంతునికే నివేదించుచుండెను. ఒకనాఁడు స్వప్నములోఁ దుకారాము శిష్యులలో నొకనికి విఠోబాస్వామి యగపడి, యభంగముల పుస్తకము నదియందు సురక్షితముగ నున్నదని తెలిపెను. మఱునాఁడు స్నానమున

కేఁగి శిష్యులు నదియందు వెదుకఁగా నయ్యది దొరకెను. తుకారామున కయ్యది మృతినొందిన పుత్త్రుఁడు మఱలఁబ్రతికిన ట్లమందానందమును జేకూర్చెను.

దైవభక్తుఁడు తుకారాము నిరంతరము విష్ణుధ్యానముఁ గావించుచు జన్మాంతమున విష్ణుపదము నొందెను.

లోకమున గీర్తినిఁగూర్చి, ముక్తినిచ్చునది దైవ భక్తియే. దానికి జాతివయోవస్థా స్త్రీ పురుషాదిభేద ములు లేవు.

## ౧౦. ఋషితిలకుఁడు

లోకమున ధర్మమార్గములన్నియు ఋషిసంతతిమూల మున నిలిచియున్నవి. శాస్త్రములు, ధర్మసూత్రములు మునుల మూలముననే వెల్లడియైనవి. ముక్తిమార్గమునకు వేదాంతము నుపదేశించు గురూత్తములు ఋషీశ్వరులు. తపోనియమంబున గామనిగ్రహంబు గలిగి శత్రుషట్కమును జయించి యమనియ మాది యోగవిద్యల నారితేఱి భగవంతునిఁ బ్రసన్నుని గావించుకొని భూలోకమునకును, స్వర్గలోకమునకును సోపానము లట్లు పరిణమించు వారలు యోగీంద్రులే! వారల వాక్య ములును, గ్రియలును నమోఘములు; మహిమ లాశ్చర్య దాయకములు. సృష్టికి బ్రతిసృష్టి చేయగల శక్తిసామర్థ్యములు వారివి. ఇట్టి ఋషీశ్వరులలో నగస్త్యమహాముని యగ్రగణ్యుఁ డని చెప్పఁదగినవాఁడు.

తొల్లి మిత్రావరుణు లొకనాఁడు వనవిహారమొనర్చు చుండ నూర్వశి వారి కంటఁబడెను. వా రామెనుఁ జూచి చకితులై మనోనిగ్రహము సేయఁజాలకపోయిరి. వారలకు బ్రహ్మర్షి యగు వసిష్ఠుఁడును, ధర్మరక్షా చరణుఁడగు నగస్త్యుఁడును జన్మించిరి. అగస్త్యుని జననము దేవ మునిగణంబులకానందదాయకమైయుండెను. కారణజన్ముఁడైన యా మహర్షి, దృఢకాయుఁడును, గుబ్జరూపుఁడునునై దీర్ఘ శ్మశ్రువులతోఁ జన్మించెను. బ్రహ్మాదిదేవత లరుదెంచిరి. బ్రహ్మ కమండలువును, నశ్వనీ దేవతలు కాషాయాంబరములను వాని కొసంగి యాశీర్వదించి చనిరి. అతఁడు బ్రహ్మచర్యదీక్షా పరుఁడై ఘోరముగా నీశ్వరునిగూర్చి తపముచేసి సర్వశక్తులఁ బడసి భూలోకమున వెలుఁగొందుచుండెను. కొంతకాలము నకుఁ దండ్రి యిచ్ఛావృత్తిని శరీరముపీడి పితృలోకమున నుండెను.

అగస్త్యుఁడు తపమునుజాలించి, వనాంతరాశ్రమములఁ బరిభ్రమించుచు ఋషీశ్వరుల దర్శించుచు బ్రహ్మజ్ఞానరహస్య ములను గ్రహించుచుండెను. ఇట్లుండ నొకదినమున నొక పల్లకి నుండి యధోముఖులై వ్రేలుచున్న తన పితరులను గాంచెను. అతఁడు వారలను గని, విస్మితుఁడై 'తండ్రులారా! ఈ విధ మున మీరు వ్రేలాడుచుండుటకుఁ గారణమేమి ?' యని ప్రశ్నించెను. అంత వారలు 'అగస్త్యా ! మేము నీ పితరులము. నీ వధికనిష్ఠమై బ్రహ్మచర్యంబు జరుపుచుంటివి. నీవు సంతాన హీనుండ వగుటంజేసి మా కూర్ధ్వలోకములు లేవు. మాన

వునకుఁ బున్నామనరకత్రాత యగు పుత్త్రుఁడు లేనిచో నతఁడు ముక్తుఁడు కాకుండుటయేగాక, పితరులకును గతులఁగల గింపలేఁడు. కావున నీవు వివాహితుఁడవై పుత్త్రునిఁ బడసి మాకుఁ బుణ్యగతులఁ గలుగఁజేయు' మని పలికిరి. అగస్త్యుఁ డందుల కియ్యకొని నాటినుండియు దనకుం దగిన పత్నీతిలకం బెచట లభింపగలదా యని యోచించుచు తిరుగుచుండెను. మానవుని జీవితము భార్యయొక్క- గుణగణంబులపై నాధారపడి యుండును. సాధ్వియు, ననుకూలవతియు నగు భార్య లభించుట పురుషుని పూర్వసంచితఫలముననే! గయ్యాళియు, దుష్టస్వభావయు నగు భార్య లభించెనా, వానిజీవితము నష్టము. కనుక నుత్తమ భార్యాన్వేషణార్థియై యగస్త్యుఁడు తిరుగు చుండెను. ఇది యిట్లుండె.

కవేరుఁడను రాజర్షి విష్ణువును గూర్చి తపస్సుచేయఁగా విష్ణుమాయవలనఁ గవేరునకుఁ నొక కుమారిక జన్మించెను. ఆమె యౌవనవతియై శివునిగూర్చి భక్తిపరవశంబునఁ దప మాచరించుచుండెను.

అగస్త్యుఁడు భార్యార్థియై తన తపఃఫలమును గొంత వెచ్చించి, యనుకూలవతియగు గన్యను సృష్టింపబూనెను. శివుఁ డాయన యత్నమును గ్రహించి తనయందు భక్తితత్పరయును దపస్వినియు నగు కవేరతనయయందుఁ గొంత యంశమును దీసి విదర్భరాజునకుఁ గొమరితనుగాఁ జేసెను.

లేక లేక పుట్టినకుమార్తె యగుటచే విదర్భ రాజామెను గడు గారవమున బెంచుచుండెను. ఆమె కతఁడు లోపాముద్రయని పేరు పెట్టెను. ఆమె యౌవనవతియై సౌంద

ర్యాతిశయములందే గాక గుణగణాతిశయములందుఁ గూడ లోకవిఖ్యాతిని బొందెను. ఆమెకు వివాహోచితవయఃకాలము దటిసెను. రాజు తన కొమరితకై నిరంతరతప మాచరించు చుండెను.

మైత్రావరుణుఁడు లోపాముద్రయొక్క యౌవనగుణ సముదాయముల గూర్చి కర్ణాకర్ణిగ విని విదర్భరాజగృహంబున కరిగెను. రాజవరుఁ డాయన నర్ఘ్యపాద్యాది విధులఁ బూజించి యాతిథ్య మొసఁగెను. అగస్త్యుఁడు లోపాముద్రను జూచి కందర్పశరావిద్ధుఁడై యా బాలను భార్యగాఁ బడయని జీవిత మేల యని తలచెను. లోపాముద్రయు మునీశ్వరునిగాంచి తన తపఃఫలము పండినదని యానందించుచుండెను. అగస్త్యుఁడు పది దినములాగి రాజునకుఁ దన మనోరథముఁ దెలిపెను. భూపతి తన గారాబుపట్టినిఁ గాననవాసియగు నొక తాపసి కెట్టులొసం గుదునా యని తన భార్య కెఱింగింప, నామె చింతించి చిలుక పిల్లను బిల్లిముం దిడినట్లు కవేరతనయను ముని కొసఁగుటెట్లా యని తలఁచి ఖిన్నురా లయ్యెను. మునివరున కాత్మజాత నీయ కున్నచోఁ దన్మునీశ్వరశాపచాపమున కెరయగుదునుగదా యన్న భయ మొకప్రక్కను, ఇచ్చినచోఁ గొమరితజీవితము నీరగునుగదా యన్నశంక మఱియొకప్రక్కను దోఁచి యా రాజవరుని మనస్సు నూగించుచుండెను. లోపాముద్ర తనతండ్రి సంకటావస్థనుగ్రహించి తన మనోహరుఁడగు భర్త యగస్త్యుఁడే యని తండ్రి కెఱుకపఱచెను. రాజవల్లభునకు మహానందము పొడమి రాణివాసమునకు నచ్చుఁజెప్పి సుకుమారియగు లోపా ముద్రను తపోనిధి కిచ్చి వైభవమున వివాహము గావించెను.

వివాహానంతరము కుంభసంభవుఁడు సకళత్రుఁడై నిజాశ్రమమున కరిగి, యైహికానంద నిమగ్నుఁడై భార్యకు సౌఖ్యములఁ గూర్చుచుఁ గాలముఁ బుచ్చుచుండెను.

ఒక్కనాఁడు కాంత భూషణభూషితయు, నూత్నవస్త్రాలంకారశోభితయు నైననేగాని భర్త కానందదాయిని గాను గదా యని తలంచి యాభరణాద్యలంకారార్థము భర్తను వేడికొనియెను. భర్తలకు భార్యల కోరికదీర్చుట ధర్మము కాని యగస్త్యుఁ డిట్టిసౌఖ్యములఁ గూర్చుటకై వలయు ధనముకొఱకుఁ దిరుగుచు నిల్వలుఁడను రాక్షసునొద్ద నమితధనముండెనని వినెను.

మణిమతీపురమున దుర్వాసునకును నజముఖకిని నిరువురు కుమారులు గలరు. వారు వాతాపి, ఇల్వలు లను నామధారులు. వారు మిక్కిలి దుర్మార్గులు. వారు జనించిన కొలది కాలమునకే తండ్రికడ కేఁగి తమకు సర్వసిద్ధికరమంత్రము నుపదేశించి, సర్వశక్తులును వారికిఁ గరవశమగునట్లు సేయుమని వేడికొనిరి. ఆ మునీశ్వరుఁడు వారి దుర్వర్తననెఱిఁగి యుపేక్షించెను. ఆ కుమారద్వయము కోపించి తండ్రినిఁ జంపఁబోయిరి. దుర్వాసుఁ డుగ్రుఁడై, వారిని లోకకంటకులైన యసురులై "యొక మునిచేఁ జంపఁబడు"నట్లు శపించెను. ఆ కుమారులు శాపభీతిచేఁ గుందుచు, నరణ్యమునకేగి బ్రహ్మనుగూర్చి తపమాచరించిరి. బ్రహ్మ ప్రసన్నుఁడు కాకుండెను. ఇల్వలుఁడు సోదరునిఁ జంపి, వాని శరీరమును ఖండించి హోమముచేసి దేవతల కాశ్చర్యమును గొలిపెను. అప్పటికిని బ్రహ్మ వీరికి దర్శన మీయలేదు. ఇల్వలుఁడు దీక్షమై బ్రహ్మను మెప్పింప

నెంచి నిజశరీరమునుగూడ హోమముసేయ నుద్యమించెను. బ్రహ్మదేవున కాశ్చర్యభయము లుద్భవించెను.

వెంటనే బ్రహ్మ ప్రసన్నుఁడై యిల్వలునకు దర్శనమిచ్చి "నీ తపంబునకు మెచ్చితిని. వరమునను గోరికొమ్మ"నెను. ఇల్వలుఁ డజునకు సవినయముగా మ్రొక్కి "తండ్రీ! నా సోదరుని బ్రదికింపు"మనెను. వెంటనే చతుర్ముఖు ననుగ్రహమున వాతాపి జీవించెను. "నా సోదరుఁ డెవనిచే నెట్లు లెప్పుడు చంపబడినను నేను బిలిచినతోడనే సుఖముగా జీవించి రావలె" ననియు, ''మా యిరువురకును గామరూపముల ననుగ్రహింపవలె'' ననియు నిల్వలుఁడు కోరెను. బ్రహ్మ వారల ననుగ్రహించి వరములఁ బ్రసాదించి యదృశ్యుఁడయ్యెను. నాఁటి నుండియు నిల్వలవాతాపులు విజృంభించి బ్రాహ్మణులఁ జంపుచు, మునుల బాధించుచు నరణ్యమున యాశ్రమము నేర్పఱచుకొని నివసించు చుండిరి. అనుదినమును నీ సోదరద్వయము ధనికులను మునులను నాతిథ్యమునకుఁ బిలిచెడివారు. ఇల్వలుఁడు వారలకు భోజనముగుటకై వాతాపిని మేకఁగామార్చి దానింజంపి యా మాంసమును వారికిఁ బెట్టి భోజనమైనంత తాను బిగ్గఱగాఁ దనసోదరునిఁ బిలిచెడివాఁడు. ఒకానొకదినమున నగస్త్యుఁ డిల్వలుని వృత్తాంతము నెఱింగి తా నా యాశ్రమముచెంత కరిగి, వారలను భిక్షకై వేడెను. వాతాపి యిల్వలు లానందించి యథా పూర్వముగా నాదరించిరి. వాతాపిని మేషముగా మార్చి వాని మాంసమును బచనముచేసి యగస్త్యునకు వడ్డించి యిల్వలుఁడు చూచు

చుండెను. అగస్త్యుఁడు తృప్తిగా భుజించి, పొట్ట నిమిరికొనుచుఁ ద్రేన్చి 'జీర్ణం జీర్ణం, వాతాపి జీర్ణం' అని బిగ్గఱగా ననెను.

ఇల్వలుఁడు వాతాపినిఁ బూర్వము వలెనే పిలిచెను. వాతాపి రాలేదు. తిరిగి రెండు మూఁడు పర్యాయములు పిలిచెను. నిష్ప్రయోజనమైనది. తోడనే యిల్వలుఁడు తండ్రి శాపమును గ్రహించి, యగస్త్యుని పాదములపైఁబడి వానికిఁ గావలసినంత ధనము నొసఁగి పంపివేసెను. అగస్త్యుఁ డా ధనముతో నింటికేఁగి నిజభార్యాశయమునుఁ దీర్చి కామసుఖంబుల నామెతోఁ గాలముగడపెను. వారలకు దృఢదస్యుఁ డను గుమారుఁడు గలిగెను.

సూర్యుఁ డనుదినంబును మేరుధరణీనాథునకుఁ బ్రదక్షిణంబు సేయుచుండుట గని వింధ్యంబున కాగ్రహముకలిగి 'నేను పర్వతప్రభువునై యుండ సూర్యుఁ డా మేరువును జుట్టుటకేమి హేతువు? వాని గమనంబును నిరోధించెద' నని చెప్పి తాఁ బెఱిఁగి యినశశితారాదులమార్గమునకవరోధముఁ గల్పించెను. రాత్రింబవళ్లు తెలియఁబడకుండెను. లోకము తల్లడిల్లసాగెను. కర్మిష్ఠుల కర్మలు నష్టములయ్యెను. అగ్ని ప్రజ్వరిల్లుట మానెను. దేవతలకు సంక్షోభము కలిగెను. దేవమునిగణములు వింధ్యంబునుఁజేరి 'భూరిరూపము నుపసంహరింపు' మని వేఁడిరి. వింధ్యంబు గర్వంబున వినదాయెను. వాతాపిహరణంబున నగస్త్యుని మహిమ మెఱింగి, దేవమునిగణము లాయనకు బర్వతుని దుండగము లెఱింగించిరి. అగస్త్యుఁడు లోకహితార్థమై వింధ్యంబును శిక్షింపనెంచెను. ఆ సమయంబున నుత్తరమున హిమ

వంతుఁడు తన పుత్రికయైన పార్వతినిచ్చి శివునకు వివాహము సేయుచుండెను. అందఱు నా వివాహమును జూచు వేడుకతో నందరిగిరి. దక్షిణావర్తమునం దెవరునులేరు. భూతకోటి యంతయు హిమాలయంబున కేగెను. అగస్త్యుఁడును బార్వతీ పరిణయమునకై వెడలెను. దేశ ముత్తరమున కొఱఁగినది. లోకము భయమందెను. శివుఁ డదిచూచి, అగస్త్యునిఁ బిలిచి, "ఋషితిలకా! నీవు దక్షిణమున కరిగి దేశ దక్షిణాగ్రమున నివసించినచో నీ ప్రమాద ముడిగి జనంబులు సుఖముందురు. నేను పార్వతీసహితుఁడనై మధుపర్కములతో వచ్చి నీకు దర్శనమిచ్చెదనని చెప్పెను. అగస్త్యుఁడు వల్లెయని లోపాముద్రా సహితుఁడై దక్షిణగామి యయ్యెను. వారలు వింధ్యయొద్దకు వచ్చుసరికి వింధ్యము మైత్రావరుణుని మహిమము వినియుం టచే వాని కెదురేఁగి పూజించెను. అగస్త్యుఁడు తమకుఁ ద్రోవ యొసంగుమని కోర వింధ్య మొదిగి నిజరూపమును గ్రహించి తెరువిచ్చెను. అగస్త్యుఁడు వింధ్యము నుద్దేశించి, "నేను తిరిగి వచ్చువర కిట్టులనే యుండు" మని శాసించి దక్షిణమార్గముఁ బట్టి పోయెను.

శంకరుఁడు కవేరపుత్రికాతపంబునకుఁ బ్రసన్నుఁడై యామెకు వరములొసఁగి యగస్త్యుకడ కరిగి నీవు కవేరతనయను వివాహము కమ్మని చెప్పెను. అగస్త్యుఁ డందులకు సమ్మతించి యామెను గోరఁగా నామె, "నదీరూపిణినై తండ్రికి ముక్తిని గూర్ప వర మొందితి"ననియుఁ దాను "స్త్రీరూపమున బహుకాల ముండనేర" ననియు నుడివెను. అగస్త్యుఁ డందుల కియ్యకొని మహేశు నాజ్ఞాప్రకార మామెను వివాహమాడి తన

కమండలమున దాచియుంచెను. వింధ్యాగర్వభంగమునిమిత్తమై వచ్చుచుఁ దనకమండలువును శిష్యుల కొప్పజెప్పి జాగ్రత్తఁగాఁ దీసికొనిరమ్మని కుంభసంభవుఁడు చెప్పెను. వా రట్లు మోసికొని వచ్చుచుండిరి. వారందఱును సహ్యాపర్వతమును జేరిరి. శంకరసుతుండైన గణపతి దేవప్రేరితుఁడై యా పర్వతమును జేరి శిష్యు లేమఱుపాటున నున్నప్పుఁ డగస్త్యుని కమండలువును గ్రిందకువంచి దాను మాయమయ్యెను. ఆ కమండలమున నుదక రూపముననున్న కవేరతనయ నదీరూపిణియై కావేరిగాఁ బ్రవహింపఁజొచ్చెను. అగస్త్యుఁ డది కని చింతాక్రాంతమానసుఁడై భార్యావియోగమునకు దుఃఖించుచు, విఘ్నేశ్వరుని లంబోదరునిగా శపించి యటనుండి దక్షిణమునకుఁ బయనమై యొకానొక పర్వతముపై నాశ్రమమును గల్పించుకొని నివసించెను.

కాలకేయాదిరాక్షసు లఱువదివేలమంది సముద్రమున నివసించుచు బయటకువచ్చి బ్రాహ్మణ, ముని, దేవసంఘముల కెగ్గు గావించుచు నింద్రుని బాధించుచుండిరి. దేవతలు వారల నెదిర్చినచో వారు సముద్రమున దాఁగుచుండిరి.

అందఱునుఁ జేరి విష్ణున కీవార్తను నివేదించిరి. శ్రీహరి యగస్త్యుని వేడుమని వారలకుఁ జెప్పెను. అందఱును జేరి యగస్త్యుని వేడిరి.

అగస్త్యుఁడు లోకహితార్థియై సప్తసముద్రము లందలి జలము నాచమనముచేసి పుక్కిటఁబట్టెను. దేవతలు చెలరేగి కాలకేయుల వధించిరి. కాని లోకము నిర్జల మగుటచే, జనులు మగుడ నగస్త్యుని బ్రార్థించిరి. అగస్త్యుఁడు కరుణించి

క్షారోదకమును గ్రక్కెను. సముద్రములు తిరిగి స్వరూపము లందెను.

శివుఁడు తన మాటప్రకారము పార్వతీసహితుఁడై వివాహమంగళవస్త్రములతో వానికి దర్శనమిచ్చి యభీష్టము లొసంగి యదృశ్యుఁడయ్యెను. అగస్త్యుఁ డచ్చటనే నిలిచి యుండెను. వింధ్యము తిరిగి లేవలేదు.

నహుషుఁడను రాజోత్తముం డనేకయాగములఁ జేసి ఇంద్రతుల్యుఁడై గర్వించి మునుల రావించి, వారలచేఁ దన యందలమును మోయించుచు వారల బాధించుచుండెడివాఁడు. ఒకానొక సమయమున నితరమునులతోఁగూడ నగస్త్యుని రావించి పల్లకిని మోయ నహుషుఁడు నియమించెను. వారలు మోయుచుండ, నిమ్నోన్నతములలో నడచుట చేతగాక మునులు తొట్రుపడుచుండిరి. నహుషుఁ డందులకు గోపించి 'సర్ప, సర్ప' యనుచు వారలను దండంబులతో మోదుచుండెను. అగస్త్యుఁ డందులకు గ్రుద్ధుఁడై 'సర్పోభవ' యని పలికెను. నహుషుఁ డందలమునుండి యజగరమై నేలఁబడెను.

విష్ణుమూర్తి రామావతారమున నగస్త్యుని యాశ్రమమున కేఁగి వానిచే గౌరవింపఁబడి కొన్నియస్త్రముల నంది యటనుండి కిష్కింధకుఁ బయనమై వెడలెను. రావణునితోఁ యుద్ధము సేయుటకు బూర్వము శ్రీరాముని దర్శించి యగస్త్యుఁ డాయన కాదిత్యహృదయము నుపదేశించి వెడలి పోయెను. శ్రీరాముఁ డద్దాని మాహాత్మ్యమున రావణుని వధింపఁ గలిగెను.

అగస్త్యుని జీవితము కడు ప్రశంసాపాత్రము. మహాత్ముల చరిత్రలనుండి మన మనేకనీతులనుఁ నేర్చుకొనఁగలుగుదుము. సత్యజీవనుఁడై మహిమగడించినవాని కీ నీతు లిహపరసాధనము లగును.

---

## ౧౧. అవతారపురుషుఁడు

గీ|| ఇంద్రియముల జయించియు వృత్తు లడఁచి
శాంతివహియించి మృదులభాషణము చిత్త
శుద్ధి భూతదయయుఁ గల్గు సుజనులకుఁ ద్ర
మమ్ముగా జన్మరాహిత్య మమరు నిజము.

ప్రపంచ మధోగతిపాలై కాపరిలేని గొఱ్ఱియలకైవడి, నాయకుఁడు లేక హింసామయమైనప్పుడు పరమేశ్వరుఁడు మానవస్వరూపమున నవతరించునని పెద్ద లందురు. అట్టి యవతారపురుషులలో బుద్ధదేవుఁ డొకఁడు.

రోహిణీనదీతీరమున హిమాలయప్రాంతమందు గపిలవస్తు అను పట్టణ మొండు గలదు. ఆ పట్టణమునకు శాక్యవంశతిలకుఁడైన శుద్ధోదనుఁడు రాజై యుండెను. ఆయన కిరువురు భార్యలు గలరు. మాయాదేవియు, గౌతమియు ననువా రా పడంతులు. అందును మాయాదేవి దైవభక్తియందును, గరుణాపరతయందును ఖనియై ప్రపంచమున నీడులేని కీర్తిని సంపాదించెను.

ఒకానొకదినమున నానారీరత్నము నక్షత్రమొండు నాకసము నుండి రాలి తన గర్భమునఁ జొచ్చినట్లు కలఁగాంచెను. అది మొద లాతనిరాజ్యమునఁ బాడిపంట లధికమై ధనములు మితిమీఱి యది నిత్యశోభనములతోఁ దులదూఁగుచుండెను. స్వప్నఫలము నిజమై మాయాదేవి గర్భవతి యయ్యెను. నవ మాసములు నిండినపిదప ప్రసవంపువేడుక లామె పుట్టినింట జరిపింప నిశ్చయించి రాజామెనుఁ బ్రయాణముచేసి సపరివారముగ నరదముపైఁ బనుపుచుండెను. మాయాదేవికి మార్గమునఁ బ్రసవవేదన తోఁచి యొక వృక్షచ్ఛాయయందు నొక సుముహూర్తమున ననల్పతేజోవంతుఁడును, నమోఘభాగ్యరేఖాలంకృతుఁడును నగు కుమారరత్నమొం డుదయించెను. దేవతలు పుష్పవృష్టి గురియించిరి. చల్లని పిల్లహాయువు లతి పేశలములై వీవఁసాగెను. దిక్కులెల్ల తేజోవంతము లయ్యెను. పుట్టినింటి కరుగకయే శిశుసహితముగ మాయాదేవి రాజధానికి మఱలెను. శుద్ధోదనుఁ డా కుమారరత్నమును గాంచి యానందపరవశుఁ డయ్యెను. పురజను లిది విని పరమసంతోషభరితులై జన్మదినోత్సవమున నవరత్నములను గానుకలుగఁ దెచ్చి యర్పించిరి. కొలఁదికాలమున కొకమునీంద్రుఁ డఱుగుదేఱ రాజు సముచితగౌరవ పురస్సరముగ నతిథిసత్కారముఁ గావించి, తవ జన్మసార్థకతకు సంతసించెను. ఆ మునిసత్తముఁ డా బాలకునిఁ గాంచి కన్నీరు నించెను. తేఁడు కారణ మరయ లేకపోయెను. అతని గుండెలు దడదడ కొట్టుకొనసాగెను. 'ఈ బాలుఁ డపగుణుఁ డనియూ, యల్పాయుర్దాయవంతుఁ డనియూ, యేల ముని కన్నీరునించెనో ?' యని యతఁడు తల

పోయసాగెను. తోడనే ఋషితిలకుఁడు 'మహారాజా ! ఇతఁడు పరిపూర్ణాయుర్దాయసహితుఁడు. కరుణామయుఁడు. సర్వలోక పవిత్రుఁడు. అజ్ఞానతిమిర భాస్వంతుఁడు. కాని కన్నతల్లియగు మాయాదేవి నేఁటి కేఁడవదినమున స్వర్గస్థురాలగు'నని తెలిపి చనియెను.

దినములు గడచెను. మాయాదేవి మునీశ్వరుని గడువు దినమున పరమపదమునంది రాజునకును బురజనులకును జిచ్చును దాకొలిపెను. శిశువును గన్నతల్లికన్న మిన్నగా గౌతమి దేశమునఁ గలవు కళవైె నిత్యకల్యాణము పచ్చతోరణముగ శుభపరంపరలు వెలయుచుండెను. రాజు తన శిశువునకు సిద్ధార్థ నామధేయము సార్థకమని తలఁచి నామకరణము గావించెను.

బాలుఁడు దినదినాభివృద్ధినొంది బాల్యము నధిగ మింపఁగాఁ దండ్రి కుమారునకు విద్యాబుద్ధులుగఱప నొక యొజ్జయొద్ద కంపెను. ఒజ్జకుఁ బాఠములు సెప్ప శక్తిసామర్థ్య ములు వానిలో గారణసంయోగము లొందిన వగుటచే సర్వ విద్యలును గొలఁదికాలముననే సిద్ధార్థున కలవడెను. అతనికి వేటాడులయం దభిమతమును, నభినివేశమును మెండయ్యనే గాని, సాధుమృగములయందలి కృపాళుత్వముమాత్రము పైచేయియై యాతని శక్తిస్వభావములకు మెఱుఁగువెట్టు చుండెను. సాముగరిడీలయందు వానికి మించిన చేయి లేదని జగద్విఖ్యాతి ప్రబలెను.

ఒకానొక దినమున దేవదత్తాదులగు గొందఱు మిత్రు లతోఁ గలసి యతఁ డుద్యానవనమున విహరింప నేగెను. చక్రని

చుక్కలై యాకసమున యథేచ్ఛగఁ బిండుగట్టి తెలిమబ్బు తఱఁగలవోలె నెగురుచున్న యంచగమిపై నరేంద్రబాలకుఁ డచ్చెరువునుఁ గ్రక్కుచున్న చూడ్కులు పఱపుచుండెను. కాని యింతలో దేవదత్తుఁ డలుగునుదీసి వింట సంధించి యెక్కుపెట్టి యందొక్క హంసపైఁ బఱపెను. అది తాకి, సూర్యాస్తమయసమయారుణమేఘపంక్తివోలె ఱెక్కదోయి యెఱ్ఱనై నెత్తురుచుక్కలోడుచుండఁ బాప మా యంచ నేలకుఁ దొరలెను. ఈ దృశ్యముఁ గనిన సిద్ధార్థుని మృదుహృదయము దహించుకొనిపోయెను. అతఁడు హంసను దఱిసి, చేతనెత్తి, ఎఱ్ఱని ఱేకులఁబోలిన యంచ ఱెక్కకు వనౌషధీరసలేపనమున బాధ నుడిగించి దువ్వి హంసను సమాశ్వాసించెను. "నేఁ గొట్టినపక్షియందు నీ కేమి యధికార" మని చెలరేగిన దేవదత్తుని సముచిత ప్రత్యుత్తరమున మందలించి వాని కహింసాతత్త్వమును బోధించెను. హంస పరమానందమున నెగిరి యాకసమునఁ బఱచెను.

కారణజన్ముఁడగు సిద్ధార్థుమనము కరుణామయమనియు, నవనీతసదృశమనియు నంతఃపురంబునను నాఁనాఁటఁ బ్రజాలోకమున వ్యాపించుచుండెను. రా జది విని దానిని మఱపించు కోర్కెమైఁ బ్రాసాదమున బంగరుబొమ్మలఁబోలు నంగనామణుల యంగవిన్యాసనృత్యవిశేషంబుగ నపరిమితంబుగ రాజపుత్త్రుని ముందుఁ బ్రకటింపించుచుండెను. తీయని చవులూరఁ జేయు సంసారసుఖపరంపరేచ్ఛ యాతని హృదయమునఁ బ్రవేశపెట్టి మనమును మఱల్చుటకై శుద్ధోదనుఁడు దేవదత్తాదులను వినియోగించుచుండెను.

'సిద్ధార్థుఁడు నిత్యము సాయంసమయములయం దుద్యానవనమున కరిగి ప్రకృతిసౌందర్యమును విలోకించుగాత' మని శుద్ధోదనుఁడు నూతనోద్యాననిర్మాణములు గావించెను. కాని యతనిదృష్టి కీటకములఁ మ్రింగు బల్లిపైకిని, దానిని జంపు నురగమువైపునకును, నద్దాని నాహారముగ జేసికొను గరుడుని మీఁదకును బోవుచు బ్రపంచమెల్ల హింసామయమన్న ప్రబోధము కలుగుచుండెనేతప్ప ప్రకృతిసౌందర్యలాలసత్వము వానికి ముగ్ధత నేకూర్పకుండెను.

నానాట యౌవన మధిగమించిన కొలఁదియు, సిద్ధార్థుని గాంచినపుడెల్ల రాజాంతఃపురకాంతామణుల హృదయకంజములు విచ్చి హసింపసాగెను. కాని సిద్ధార్థుఁడు వారివైపున కయిన మోముద్రిప్పక పవిత్రహృదయమును పెంపొందించుచుండెను. దైవనియోగముచేఁ గొంతకాలమున కాతని మనస్సు సార్థకనామయు, సుగుణఖనియు నగు యశోధరాదేవి యను గన్యారత్నముపైకి పరుగువెట్టెను. ఆమెయు నీతనికై దండచేఁ దరింపవలెనని తత్కై వేచి చింతనముసలుపసాగెను. ఇది శుద్ధోదనునకుఁ దెలియవచ్చి యానందపరవశుఁడయ్యెను. ఇతఁ డయ్యంగనామణి తలిదండ్రులయానతిగొని, తన కొమరునకు వివాహమహోత్సవమును జరిపించెను. యశోధరాసిద్ధార్థులు సౌఖ్యలాలసులై యితరేతర ప్రేమానుబంధములు బిగువు గావించుకొన నిత్యానందమునఁ గాలముగడుపుచుండిరి. యశోధరాదేవికి గర్భచిహ్నములు పొడసూపసాగెను.

ఒకనాఁ డుద్యానవనవిహారము గావించుటకై రాజకుమారుఁ డుసారథిం బిలిచి, 'తేరు సన్నద్ధపఱుపు' మనికోరెను.

అతఁ డట్లు కావింప, నాతఁడా యరదము నధిరోహించెను. రథము సాగుచుండెను. పోవఁబోవ నొక వీథిలో ముడుతలు పడ్డ మేనుతో, నరసి తెల్లనై యూగుచున్న తలతోఁ, జేతఁ గట్టను నేలపైఁ గొట్టుకొనుచు, వణకుచు కాళ్ళూనియు నూనలేక పడిలేచుచున్న యొక వృద్ధుఁడు సిద్ధార్థుని కన్ను దోయికిఁ దోఁచెను. 'చెన్నా! అతఁ డట్లున్నాఁడే' మని సారథి నతఁడు ప్రశ్నించెను. 'అది మనుష్యనైజమైన వృద్ధదశ' యని యతఁ డుత్తరమిచ్చెను.

రథము మఱింత ముందునకు సాగెను. నాలుగు కొనలను నలువురు మనుష్యులు మూపులపై బెట్టుకొని మోయుచున్న యొక శవము సిద్ధార్థునకు దృగ్గోచరమయ్యెను. 'అదే' మని సిద్ధార్థుఁడడిగెను. అది మనుష్యుని యవసానదశ యని చెన్నఁడు ప్రత్యుత్తరమిచ్చెను.

సిద్ధార్థుఁడు రథము మందిరమునకు మఱల్పుమనెను. రథమును మఱల్చి చెన్నఁడు రాజాంతఃపురమునకుఁ దోలెను. సిద్ధార్థుఁడు నిరంతరచింతలో మునిఁగెను. 'ఈ యౌవనము బుద్బుదప్రాయము. జీవి ముదుసలితనమునఁ జేయఁదగు కార్యములేదు' అనియు, 'నెంతవానికైనను మరణము తప్పదు. జీవిపరతత్త్వమెఱుఁగకున్న నధోగతి పాలగునుగదా', యనియు సిద్ధార్థుఁడు చింతనము నలుపసాగెను.

ఇంతలో నొక్క కాంతామణి రాజకుమారునిఁ దఱిసి దేవరవారి కొక్క పుత్త్రరత్నము గలిగినాఁడని పలికెను. పారితోషికమిచ్చియామెనుఁదనుపుటకు మాఱుగ, 'ఇది యింకొక

యభ్యంతర' మని బదులుచెప్పెను. అందుచేఁగుమారున కతఁడు 'రాహులుఁ' డని నామకరణముఁ గావించెను.

కొన్నిమాసములు కడచెను. ఒకనాఁటితేయియర్ధరాత్రమున సిద్ధార్థుఁడు చెన్నని లేపి యశ్వము నాయత్తముఁగావింపుమని చెప్పితనతరుణీమణిదిక్కునకుఁ జూపుద్రిప్పెను. పసిబాలుని డొక్కలో గదియించుకొని యన్నారీమణి నిద్రించుచుండెను. సిద్ధార్థుని కనుగొనలనుండి యశ్రుకణము లురలఁజొచ్చెను. వాని నాచికొని, యతఁడు తరుణీరత్నమును, బసికూనను ముద్దిడుకొని లేచెను. అజ్ఞానసంపన్నుఁడొకటిరెండడుగులు వెనుకకు వేయుచు బోవసంకల్పించెను. కాళ్ళుకదలవు. ముఖము వెనుకకుమలఁగదు. తిరిగి యతఁడు ముందడుగు వేసెను. అతఁ డొక్కింతతడ వాలోచించెను. 'ఇదికాదు పని' యని మొగము మఱల్చెను. కాళ్ళాని నడచెను. కాని మనస్సు సంచలించుచుండెను. అతఁ డద్దానిని బిగఁబట్టుచుండెను. అతఁ డెట్టకేలకు బయటికరిగి యశ్వము నధిరోహించెను. సిద్ధార్థుని కరస్పర్శము ననుసరించి యశ్వ మధిక వేగమునఁ బురము దాఁటెను. చెన్నఁడు వెన్నంటి పరువిడెను. ఇట్లొకయరణ్యమధ్యమున కరిగి సిద్ధార్థుఁడు దిగి, హయముమేను నిమురసాగెను. అశ్వము కనుగొనలనుండి నీరములు మున్నీరులై ప్రవహించెను. చెన్నని విషాదమునకుఁ బరిమితిలేదు. సిద్ధార్థుఁడు దువ్వలువలూడ్చి భూషణములు దీసి చెన్ననికిచ్చి తురఁగమును గొనిపొమ్మని చెన్ననిఁ గోరెను. అతడు పురపురం బొక్కుచు నట్లుకావించెను. పురమెల్ల గగ్గోలు పడెను. శుద్ధోదనుఁడు విచారమున మునిఁగెను.

సిద్ధార్థుఁడు నిశ్చలమనస్కుఁడై ప్రపంచకళ్యాణార్థము జ్ఞానాన్వేషణము సలుపుచుఁ గనఁబడినయోగివరుల నడిగి సమస్తతత్త్వరహస్యములనుఁ దెలిసికొనుచుఁ బ్రతిక్షణమును వినియోగించుకొనుచుండెను. ఇదికా దది యని, అదికా దిది యని, జ్ఞానమార్గముల నన్వేషించి తుద కొకానొకవృక్షము క్రింద నీరైనఁద్రావక చండాతపమునకు శరీరము నొప్పఁజెప్పి, యాఱువత్సరములు ఘోరమైన తపస్సు గావించెను. తుద కనల్పమైన తేజస్సు సిద్ధార్థుని మనసునకుఁ దోఁచెను. అదిమొదలతఁడు బుద్ధుఁడయ్యెను. ఆతఁ డంతటలేచి, లోకమున హింస నడఁచుటకై దీక్షవహించి పరిభ్రమింపసాగెను. పాషండమతస్థులకును, వైదికయజ్ఞయాగాదులు గావించు బ్రాహ్మణులకును నితఁడు కంటకుఁడువోలెఁ గానిపించినను, ప్రజాసామాన్యమునఁ గొంతమంది కతఁడు దైవస్వరూపునివలె దోఁచుచుండెను. ఇతనికి శుశ్రూషగావించుచుఁ గొలఁదికొలఁదిగ మానవులు తత్త్వవిదులై ప్రచారముసల్పసాగిరి. అశోకచక్రవర్తి యీతని ముఖ్యశిష్యుఁడు. బుద్ధుఁడు నానాదేశరాజాస్థానముల కరిగియితర మతసిద్ధాంతములను ఖండించి, యహింసాతత్త్వముఁ బ్రబోధించుచుండెను. నిర్వాణ మనఁగా వేఱులేదు. ఉత్తమజ్ఞానసంపన్నతయే ముక్తిపదమని తత్త్వోపదేశముః సేయుచుండెను. ఈ మహాత్మునిమతమునే బౌద్ధమత మందుము. ఇతఁడిచ్చిన జ్ఞానదీపకళిక నిత్యప్రభావంతమై జగమున నిప్పటికిని వెలుగుచున్నది కదా !

ఓం తత్సత్